




75 ఏళ్ల బాబు

మరో రెండు రోజుల్లో ఈ నవయువ్వనుడు 75వ పుట్టిన రోజు జరుపుకోబోతున్నాడు. పుట్టింది రైతు కుటుంబంలో. చదువుకున్నది ఎకనామిక్స్. వృత్తి రాజకీయం. అయినా టెక్నాలజీతో కలిసి పరుగులు తీస్తారు. నడిచేది వర్తమానంలో అయినా.. దృష్టి పాతికేళ్ల ముందుకే సారిస్తారు. ఈయన వయసును గెలిచిన రహస్యం.. బహుశా నిరంతర మేధోమథనం.

సంక్షోభాలను సానుకూలంగా మార్చుకోగల చాతుర్యం.. బడా సంస్థలను సైతం ఒప్పించి రాష్ట్రానికి రప్పించగల నైపుణ్యం.. దేశాధినేతలను సైతం మెప్పించగల మాటకారితనం.. నారావారిపల్లి గడ్డమీద పుట్టిన ఈ రైతుబిడ్డకు ఇవన్నీ ఎలా సాధ్యం..?!

కయ్యాకాలువల్లో ఈతలు.. బడికి మైళ్ల నడకలు.. ఒళ్లొంచి చేసిన పొలం పనులు.. చదువుకునే రోజుల్లోనే శ్రమదానాలతో పల్లెరోడ్లకు మెరుగులు.. బడికోసం జోలెపట్టి ఊరూరా, గడపగడపా తిరిగిన అనుభవం.. వెన్నంటి ఉండే స్నేహబృందాలు.. శీనయ్య మెస్‌లో భోజనాలు.. గురువులతో చర్చలు.. ప్రతి అడుగు నుంచీ చంద్రబాబు పాఠాలు నేర్చుకున్నారని ఆయన బాల్య స్నేహితులూ, ఆయనతో కాలేజీల్లో కలిసి చదువుకున్నవారూ, ఆయనకు చదువు చెప్పిన గురువులూ చెబుతున్నారు. విజనరీగా చంద్రబాబుకు బీజాలు చిన్ననాటి నుంచే పడ్డాయని వారు గుర్తు చేసుకుంటూ ఆంధ్రజ్యోతితో పంచుకున్న జ్ఞాపకాలు వెల్లడిస్తున్నాయి. ఏప్రిల్ 20న చంద్రబాబు 75వ పుట్టినరోజు సందర్భంగా ఆయన బంధుమిత్రుల ఇంటర్వ్యూలు ఈ రోజు నుంచీ వరుసగా అందిస్తున్నాం.

75 ఏళ్ల బాబు బాల్య సంగతులు.. 6వ పేజీలో



ఎండల ధాటికి బోసిపోయిన చిత్తూరు దర్గా సర్కిల్

పెరుగుతున్న ఎండలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ ఎండలు పెరిగిపోతున్నాయి. అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తున్నా, ఎండ వేడిమి ఏమాత్రం తగ్గడం లేదు. గురువారం అత్యధికంగా శ్రీరంగరాజపురంలో 40.3, అత్యల్పంగా రామకుప్పంలో 32.8 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.నగరిలో 40.1డిగ్రీలు, తవణంపల్లెలో 39.9, పులిచెర్ల, పెద్దపంజాణి, పూతలపట్టు, వెదురుకుప్పం మండలాల్లో 38.4, చిత్తూరు, గంగాధరనెల్లూరు మండలాల్లో 38.2, సదుంలో 38, పెద్దపంజాణి, గంగవరం, యాదమరి మండలాల్లో 37.9, గుడిపాలలో 37.5, చౌడేపల్లి, ఐరాల, పెనుమూరు, కార్వేటినగరం, విజయపురం, నింద్ర, పాలసముద్రం మండలాల్లో 37.2, సోమల, బంగారుపాళ్యం మండలాల్లో 37.1, రొంపిచెర్లలో 36.8, గుడుపల్లి, శాంతిపురం, వి.కోట మండలాల్లో 36, బైరెడ్డిపల్లిలో 35.6, పలమనేరు, పుంగనూరు మండలాల్లో 35, కుప్పంలో 34.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఏడాదికి మూడుపంటలు పండే భూములు.....90శాతం వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు....గత ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్ల నిర్మాణం పేరుతో వందల ఎకరాల పొలాలు లాక్కున్నారు.ముందు పరిహారం సంగతి తేల్చండంటూ అడ్డుపడ్డ రైతులపై దౌర్జన్యాలు జరిపారు.రిజర్వాయర్ పనులు కోర్టు ఉత్తర్వులతో ఆగిపోయినా అప్పటికే జరిగిన పనులతో సేద్యానికి పనికిరాకుండా పోయిన భూములను చూసి నిస్సహాయంగా మిగిలిపోయిన రైతులు ప్రస్తుత ప్రభుత్వంలో అయినా న్యాయం జరుగుతుందని ఆశపడుతున్నారు.

- భూ పరిహారం కోసం నేతిగుట్లపల్లె రిజర్వాయర్ ముంపు బాధితుల ఆవేదన
- వైసీపీ సర్కారు హయాంలో అష్టకష్టాలు
- రిజర్వాయర్ పనులతో సేద్యానికి పనికిరాకుండా పోయిన పొలాలు



నిర్మాణంలో ఉన్న నేతిగుట్లపల్లె రిజర్వాయర్

ఇంకెంతకాలం ఈ బాధలు?


పుంగనూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వేల ఎకరాలకు సాగునీరందిస్తామంటూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లక్రితం పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె, సోమల మండలం ఆవులపల్లె, అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం ముదివేడు ప్రాంతాల్లో రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టింది.ఈ రిజర్వాయర్ల పనుల కాంట్రాక్టు నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ సంస్థ చేజిక్కించుకుంది.వీటిలో నేతిగుట్లపల్లె వద్ద ఒక టీఎంసీ నీటి సామర్థ్యంతో 900 ఎకరాల ముంపుభూమిలో 2400 మీటర్ల పొడవు, దాదాపు 5 మీటర్ల ఎత్తుతో రూ.717.80 కోట్ల అంచనాతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణ పనులను 80 శాతం పూర్తి చేసింది.

నిబంధనలకు విరుద్ధంగా పనులు

రిజర్వాయర్ నిర్మాణానికి రైతులకు చెందిన భూమి ఎంతకావాలనేది ముందు నిర్ణయించాలి.ఎంతమంది ఆస్తులు, ఇళ్లు కోల్పోతారో తేల్చాలి.వారందరికీ నోటీసులు ఇవ్వాలి. మార్కెట్ ధర ప్రకారం ఎంత పరిహారం ఇచ్చేది తెలియజేయాలి.అయితే ఇవేమీ లేకుండా పనులు చేపట్టారు. 845 మంది రైతులకు చెందిన 827 ఎకరాలు స్వాధీనం చేసుకున్నారు.రిజర్వాయర్ ముంపులో కట్టసమీపంలోనే ఏటిగడ్డ కమ్మపల్లె(జోగులగడ్డ)లో 16 ఇండ్లలో దాదాపు 80 మంది జీవిస్తున్నారు. గ్రామంలోని రైతులు 20 వ్యవసాయ బోర్లు వేసుకుని వ్యవసాయం చేస్తున్నారు.రిజర్వాయర్ నిర్మాణంతో తమ ఇళ్లు , పొలాలు నీటమునుగుతాయని , కాబట్టి తమకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో పాటు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.భారీ వర్షాలు కురిసి పైభాగంలోని ఏతాలవంక నుంచి వరదనీరు వస్తే గ్రామం నీటిలో మునిగిపోతుందని వివరించారు.అయితే అప్పటి పాలకులు కానీ, అధికారులు కానీ ఏమాత్రం పట్టించుకోలేదు.అధికారుల బృందం హడావుడిగా పొలాలపై పడి రైతులను సంప్రదించకుండానే సర్వేలు చేసి హద్దులు ఖరారు చేయడం, విద్యుత్ లైన్లు తొలగించడం, మట్టి తవ్వకాలు చేపట్టడం జరిగిపోయింది.చెప్పాపెట్టకుండా తమ పొలాల్లో జొరబడడం ఏంటని సర్వే జరిగిన ప్రాంతాల్లో పొలాల యజమానులు అడ్డుకున్నారు. ఎవరికి చెందిన పొలం ఎంత ముంపునకు గురవుతుంది, ఎంత పరిహారం ఇస్తారు, ఎప్పుడు ఇస్తారు, తమ జీవనానికి ప్రత్యామ్నాయంగా ఏమిస్తారు....తదితర ప్రశ్నలకు సమాధానం ఇచ్చేవరకు పనులు నిలిపేయాలని రైతులు ఆక్షేపించారు.అయితే ఆందోళనలు అరణ్యరోదనే అయ్యాయి. పీఎల్ఆర్ ప్రాజెక్టు భారీ యంత్రాలను రంగంలోకి దించి రిజర్వాయర్ల పనులను చేపట్టింది. ఉన్నతాధికారులు సైతం వారికి అడ్డుచెప్పే పరిస్థితి లేకపోవడంతో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది.వారి పొలాల్లోకి కూడా స్వేచ్ఛగా వెళ్లలేక అక్కడ పనిచేసే వారి అనుమతితో వెళ్లాల్సిన దీనస్థితి నెలకొంది. గట్టిగా మాట్లాడితే వైసీపీ నాయకులు తప్పుడు కేసులు పెట్టించడంతో పాటు దౌర్జన్యాలకు దిగేవారని, మీ భూములను ఆన్‌లైన్ నుంచి తొలగిస్తామని, పరిహారం ఇవ్వబోమని, భూమి అసలు మీది కాదు వేరే వారిదంటూ పెద్దిరెడ్డి పేరుచెప్పి భయపెట్టేవారని రైతులు ఆవేదన చెందేవారు. తమ పొలాల్లో పైపులు తొలగిస్తామని, డ్రిప్ పరికరాలు తీసుకుంటామని, చెట్లు కొట్టుకుంటామని రైతులు ప్రాధేయపడినా మీకు సంబంధం లేదని, ముందు వెళ్లకపోతే ఇక్కడే పూడ్చేస్తామంటూ భయపెట్టేవారని వారు చెప్పేవారు.నేతిగుట్లపల్లె రిజర్వాయర్ కట్ట నిర్మాణం కోసం ముంపు, సమీప పొలాల్లో భారీ యంత్రాలతో పెద్దపెద్ద గోతులు తవ్వడంతో ప్రస్తుతం ఆ భూములు వ్యవసాయానికి పనికిరాకుండా పోయాయి. అప్పటి కలెక్టర్ హరినారాయణ , జలవనరులశాఖ అధికారులు రిజర్వాయర్ పనులను పరిశీలించడం తప్ప ముంపు రైతులతో చర్చించలేదు. రైతులు పరిహారం గురించి అడిగితే నెల రోజుల్లో ఇస్తామని చెప్పడం తప్ప ఒక్క రైతుకూ ఇవ్వలేదు.ఏటిగడ్డకమ్మపల్లె, ఇర్లవాండ్లపల్లె,దిగువకొండమీద ఇళ్లు, ఆరంట్లపల్లె, ఆవులవారిపల్లె, ఎర్రగుంట్లపల్లె, నేతిగుట్లపల్లె, దిగువ చింతలవారిపల్లె, పట్రపల్లె గ్రామాలకు చెందిన 150 మంది రైతులకు చెందిన దాదాపు 800 ఎకరాలు భూమి, దాదాపు 50 వ్యవసాయ బోర్లుకు పరిహారం ఇవ్వాల్సిఉంది.



వ్యవసాయానికి పనికి రాకుండా గోతులమయమైన వ్యవసాయభూములు



ఎన్జీటీ ఆదేశాలతో ఆగిన రిజర్వాయర్ పనులు

సోమల మండలం ఆవులపల్లె వద్ద సీతమ్మ చెరువుపై రిజర్వాయర్ నిర్మిస్తే రైతుల భూములు, గ్రామాలు నీట మునగడమేకాక వేలసంఖ్యలో చెట్లు నాశనమవుతాయని, కట్ట వెనుక ప్రభుత్వ భూమిలో నిర్మిస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదని రైతులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)ను ఆశ్రయించారు.దీంతో రిజర్వాయర్ల నిర్మాణానికి పర్యావరణ అనుమతులు లేవని 2023 మే 11వ తేది ఎన్జీటీ ఆగ్రహం వ్యక్తం చేసింది.రాష్ట్రప్రభుత్వానికి రూ.100 కోట్ల జరిమానా విధిస్తూ పనులు ఆపేయాలని తీర్పు ఇచ్చింది. ఒకే జీవోతో ఆవులపల్లె, నేతిగుట్లపల్లె, ముదివేడు రిజర్వాయర్లు మంజూరు కావడంతో మూడుచోట్లా పనులు ఆగిపోయాయి. నేతిగుట్లపల్లె వద్ద రిజర్వాయర్ పనులు 80శాతం పూర్తి కావడంతో రైతుల పరిస్థితి ఘోరంగా మారింది. రిజర్వాయర్ పనులు ఆగిపోయినా పొలాల రూపురేఖలు మారిపోయి సేద్యానికి పనికిరాకుండా పోయాయి.అటు పరిహారం అందక...ఇటు సేద్యం చేసుకోలేక జీవనాధారం కోల్పోయిన రైతులు కూటమి ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

పదెకరాల భూమి లాక్కున్నారు



రిజర్వాయర్ కట్ట కిందే మాకు పదెకరాల భూమి ఉండేది. మాకు తెలియకుండానే సర్వే చేసుకున్నారు. భూమిలోకి చొరబడి పనులు చేపట్టారు. అడ్డుకునేందుకు వెళితే దౌర్జన్యం చేసి తరిమేశారు.వీఆర్వో నుంచి కలెక్టర్ వరకూ ఎన్నిసార్లు ప్రాధేయపడినా ఎవరూ పట్టించుకోలేదు.గతంలో రిజర్వాయర్ వద్ద తిరగాలన్నా భయపెట్టే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు. మా భూములకు పరిహారం ఇచ్చి చంద్రబాబు ఆదుకోవాలి.

- కె.వెంకట్రమణ, ఎర్రగుంట్లపల్లె

ఇప్పుడైనా న్యాయం జరిగేనా?



ఏడాదికి మూడు పంటలు పండే భూములు ఎందుకూ పనికిరాకుండా గోతులతో దర్శనమిస్తున్నాయి. రైతుల పేరు చెప్పి కాంట్రాక్టు పనులు దక్కించుకున్న పెద్దలు మా నోట్లో మట్టి కొట్టారు. పరిహారం ఖరారు చేయకుండా కాంట్రాక్ట్ పనులు మాత్రం 80శాతం చేశారు. ఇప్పుడైనా మా భూములకు పరిహారం ఇచ్చి, పునరావసం కల్పించాలి.

- రమణమూర్తి, ఏటిగడ్డకమ్మపల్లె

పెద్దిరెడ్డి ఖాళీ చేసుకుని వెళ్లారు



మా భూములకు పరిహారం ఇవ్వకుండా కాంట్రాక్ట్ పనులతో పెద్దిరెడ్డి ఖజానా ఖాళీచేసుకుని వెళ్లారు.అప్పట్లో మమ్మల్ని చెడగొట్టి ఇప్పుడు కూటమి ప్రభుత్వం వద్ద పరిహారం ఇప్పించుకోవాలని సలహాలిస్తున్నారు.పరిహారం వారం రోజుల్లో వస్తుందని,సంతకాలు పెట్టాలని గతంలో తహసీల్దార్ చెప్పడంతో పెట్టాం. కానీ ఇంతవరకు పరిహారం ఒక్కపైసా రాలేదు.

- కృష్ణమూర్తి, ఏటిగడ్డ కమ్మపల్లె

అడ్డొస్తే పూడ్చేస్తామన్నారు



మాకున్న పదెకరాల మామిడితోటను,పంటలను నాశనం చేస్తుండగా అడ్డుకున్నాం.దౌర్జన్యం చేసి ఇక్కడే పూడ్చేస్తామని బెదిరించడం తో గమ్మునుండిపోయాం.అడవిలో ఒక్కో రైతుకు రెండెకరాల భూమిస్తామని అప్పట్లో పెద్దిరెడ్డి చెప్పినా జరగలేదు.పదెకరాల భూమి ఉన్నా జీవనం కష్టమై కూలీ పనులకోసం వలస వెళ్లిపోయాం.

- చంద్ర, ఆరంట్లపల్లె

స్కూల్‌గేమ్స్‌లో అవకతవకలు

- 28అంశాలపై ఆరోపణలు, ఫిర్యాదులు
- చిత్తూరులో విచారణ చేపట్టిన ఆర్ఐపీఈ



విచారణ చేస్తున్న ఆర్ఐపీఈ భానుమూర్తిరాజు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల నిర్వహించిన స్కూల్‌గేమ్స్ టోర్నమెంట్లలో అవినీతి, అక్రమాలు జరిగాయనే ఆరోపణలు, ఫిర్యాదులపై విచారణ ప్రారంభమైంది. గురువారం చిత్తూరులోని డీఈవో కార్యాలయానికి రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ భానుమూర్తి రాజు నేతృత్వంలో విచారణాధికారుల బృందం వచ్చింది. స్కూల్ గేమ్స్ సెక్రటరీ వసంతవాణితో పాటు టోర్నమెంట్ నిర్వహణలో భాగస్వాములైన పీడీలను విచారించారు.వసంతవాణితో పాటు పలువురు పీడీలు స్కూల్ గేమ్స్ టోర్నమెంట్లలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు డీఈవో వరలక్ష్మికి ఇటీవల పలువురు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశారు.బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు చిత్తూరు ఎంపీ నుంచి డీఈవోకు ఫిర్యాదులు అందాయి. వీటిపై డీఈవో ప్రాథమిక నివేదిక తయారు చేసి ఆర్జేడీ కార్యాలయానికి పంపారు.ఆర్జేడీ శామ్యూల్ ఈ వ్యవహారాలపై ఆర్ఐపీఈని విచారణ అధికారిగా నియమించారు. స్కూల్ గేమ్స్‌లో భాగంగా జిల్లాలో అండర్ -14,17,19 విభాగాల్లో మూడు టోర్నమెంట్లు నిర్వహించారు. యాదమరిలో రెజ్లింగ్, అరగొండలో సాఫ్ట్‌బాల్, పూతలపట్టులో త్రోబాల్ టోర్నమెంట్లు నిర్వహించారు. చిత్తూరు బాస్కెట్ బాల్, హిందూపురంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నీలకు చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పీడీలు రెఫరీలుగా వ్యవహరించారు. తిరుపతికి చెందిన పీడీ నూర్ మహ్మద్‌తో పాటు జిల్లాకు చెందిన పీడీలు కృష్ణయ్య, సిరాజ్, రవి, బాబులపై వచ్చిన ఆరోపణలపై సైతం విచారణ చేపట్టారు. స్కూల్ గేమ్స్ నిర్వహణలో భోజన సౌకర్యం, ఇతర అవసరాలకై పలువురు పీడీలు స్థానిక ంగా దాతల నుంచి డబ్బులు వసూలు చేసి ఖర్చు చేశారు. అయితే వీటిని లెక్కల్లో చూపకుండా స్కూల్ గేమ్స్ నిధుల నుంచి రికవరీ చేయడానికి రూ.2 లక్షలకు సంబంధించి ఏకంగా జీఎస్టీ బిల్లులు సమర్పించడంపై విచారణ మొదలైంది. హిందూపురంలో నిర్వహించిన వాలీబాల్ క్రీడల్లో సెలక్షన్ కమిటీలోని పీడీలు నూర్ మహ్మద్, సిరాజ్ నైపుణ్యం కలిగిన క్రీడాకారుల్ని కాకుండా వారికి అనుకూలమైన వారిని ఆడించినట్లు తిరుపతికి చెందిన పలువురు డీఈవోకు ఫిర్యాదు చేశారు. అనుకూలమైన క్రీడాకారుల్ని ఆడించడానికి పైరవీలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేశారు. జిల్లాలో నిర్వహించిన టోర్నమెంట్లలో అక్కడి పీడీలు దాతల నుంచి డబ్బులు వసూలు చేయడంతో పాటు క్రీడల్లోనూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టారు.జిల్లాలోనే కాకుండా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన క్రీడల్లో రెఫరీలు, సెలక్షన్ కమిటీల్లో పాల్గొన్న జిల్లాకు చెందిన పీడీలు ఏకపక్ష నిర్ణయాలతో ప్రతిభ కలిగిన క్రీడాకారుల్ని పక్కన పెట్టినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టారు.క్రీడల నిర్వహణలో జిల్లాస్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే అక్రమాలు జరిగాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులపై విచారణ చేపట్టి నివేదికను ఆర్జేడీకి సమర్పిస్తానని ఆర్ఐపీఈ తెలిపారు.

యూట్యూబ్‌లో చూసి బైకుల దొంగతనాలు

- పూతలపట్టు యువకుడి అరెస్టు

తిరుచానూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. జులాయిగా తిరిగాడు. జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈజీమనీ సంపాదించాలని యూట్యూబ్‌లో మోటార్‌సైకిళ్ల దొంగతనాలు చూసి దొంగగా మారాడు. ఎట్టకేలకు తిరుచానూరు పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్ఐ అరుణ గురువారం రాత్రి మీడియాకు తెలిపిన వివరాలు ఇలా.. పూతలపట్టుకు చెందిన గోపి(19) జులాయిగా తిరుగుతూ తల్లిదండ్రులతో గొడవ పడి ఇంటి నుంచివచ్చేశాడు. ద్విచక్ర వాహనాలు ఎలా దొంగతనం చేయాలో యూట్యూబ్‌లో వీడియోలు చూశాడు. రెండు రోజుల నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మోటారుసైకిళ్ల, సెల్‌ఫోన్ల వరుస దొంగతనాలకు పాల్పడ్డాడు. గురువారం తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని చైతన్యపురం వద్ద నిందితుడు గోపిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 12 మోటారు సైకిళ్లు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకున్న సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐ అరుణ, సాయినాథ్‌చౌదరిలను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

మంత్రి లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు

వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టుపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టుపై చిత్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 16వ తేదీన మంత్రిపై ఎక్స్ వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ.. ఫొటోను మార్ఫింగ్ చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టు పాలేటి కృష్ణవేణి పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్‌పై చిత్తూరు బీవీరెడ్డికాలనీకి చెందిన న్యాయవాది శ్రీనివాసబాబు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఎస్పీ మణికంఠ ఆదేశాలతో బుధవారం కేసు నమోదు చేసినట్లు గురువారం పోలీసులు తెలిపారు.

టీచర్ల సీనియారిటీ జాబితాపై 20వరకు అభ్యంతరాల స్వీకరణ

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీచర్ల సీనియారిటీ జాబితాకు సంబంధించి అభ్యంతరాలను ఈనెల 20వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు డీఈవో వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లనుంచి హెచ్ఎంలుగా పదోన్నతికి సంబంధించి మెరిట్ ప్రకారం జడ్పీ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ టీచర్ల సీనియారిటీ జాబితా గురువారం డీఈవో సైట్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు. అభ్యంతరాలను ఈనెల 20వ తేదీలోపు సెలవు దినాల్లో సైతం స్వీకరించనున్నామని పేర్కొన్నారు. గడువు తర్వాత వచ్చే అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోరని డీఈవో ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

చంద్రబాబు గొప్ప దార్శనికుడు అని ప్రపంచం కీర్తిస్తుంది. సంక్షోభాలను సైతం అనుకూలంగా మలచుకోగల నేర్పుగల నాయకుడు అని రాజకీయ పండితులు పొగుడుతారు. ఇంజనీరింగ్ చదువుకోలేదు కానీ టెక్నాలజీని ఔపోసన పట్టిన మేధావిగా అందరూ గుర్తిస్తారు. అభివృద్ధికి దారులు వెతకడానికి తపనపడే నారా చంద్రబాబు నాయుడిలో ఈ లక్షణాలన్నీ చిన్ననాటి నుంచే ఉన్నాయి. నారావారిపల్లిలో మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టిన చంద్రబాబు.. వెనుకబాటుతనంపై సీఎంగా చేస్తున్న పోరాటానికి బీజాలు బాల్యంలోనే ఉన్నాయని ఆయన చిన్ననాటి నేస్తాల మాటల్లో వెల్లడవుతోంది.. ఈ 75 ఏళ్ల నిత్య ఉత్సాహి బాల్య జ్ఞాపకాలను ఆంధ్రజ్యోతితో వారు పంచుకున్నారు.

ఇంటర్వ్యూలు

ఆంధ్రజ్యోతి బ్యూరో
తిరుపతి







భూములు, బావులున్నోడే!

చంద్రబాబు తండ్రి ఖర్జూరనాయుడుకు రెండెకరాల భూమి మాత్రమే వుండేదని, అలాంటిది చంద్రబాబుకు ఇంత ఆస్తి ఎలా వచ్చిందని రాజకీయ ప్రత్యర్థులు తరచూ ఆరోపణలు, విమర్శలు చేస్తుంటారు. అవి విన్నప్పుడు నాకు నవ్వు వస్తుంటుంది. మాది ఎ.రంగంపేట. చంద్రబాబుది నారావారిపల్లి. ఇద్దరం ఆరో క్లాసు నుంచీ కలసి చదువుకున్నాం. ఇప్పటికీ మా ఫ్రెండ్‌షిప్ కొనసాగతానే వుంది. మేము హైస్కూల్లో చదువుకునేటప్పటికే చంద్రబాబు వాళ్ళకు 15 ఎకరాల భూములు వున్నాయి. చెరకు, వరి, వేరుశెనగ పంటలు వేసే వాళ్ళు ఎంతమంది ఎన్ని అన్నా చంద్రబాబు నోరు మెదపడు. నా చిన్నతనంలోనే 15 ఎకరాలు వుండేదని చెప్పి ప్రత్యర్థుల నోళ్ళు మూపించచ్చు కదా! కానీ అలా చేయడు. అదీ చంద్రబాబు!

పావలా వడ్డీకి అప్పులిచ్చేవాడు ఖర్జూరనాయుడు

చంద్రబాబు తండ్రి ఖర్జూరనాయుడు ఆ రోజుల్లోనే చుట్టుపక్కల రైతులకు అప్పులిచ్చేవాడు. నాకు బాగా గుర్తుంది. అవసరానికి వచ్చి అప్పు అడిగే వాళ్ళకు, ఆయన ఆ కాలంలోనే పావలా వడ్డీకి అప్పులిచ్చేవాడు.పంచె అంచు పక్కకు లాగి డ్రాయరు జేబులో నుంచీ నోట్లు తీసి లెక్కబెట్టి ఇవ్వడం ఎన్నో సార్లు చూసినా.

12 కిలోమీటర్లు నడిచి బడికి

చంద్రబాబూ నేనూ రోజూ అడ్డదావన ఆరు కిలోమీటర్లు నడిచి చంద్రగిరి హైస్కూలుకు పోయేవాళ్ళం. మళ్ళా సాయంకాలం ఆరు కిలోమీటర్లు నడిచి ఇంటికి చేరేవాళ్ళం. నారావారిపల్లి నుంచీ దర్శిపల్లి దళితవాడ, పుల్లయ్యగారిపల్లి, కొట్టాల గరండాలు (రైలు వంతెన), రెండు గుట్టల మధ్య ఆంజనేయస్వామి గుడి దాటి చంద్రగిరి హైస్కూలు గ్రౌండ్‌లోకి వెనక దారి నుంచీ చేరుకుంటా వుంటిమి. స్కూల్లో చంద్రబాబుది బి సెక్షన్. నాది సి సెక్షన్. క్లాసులోనే విడిగా కుర్చునేది. మిగిలిన సమయమంతా ఇద్దరం కలిసే తిరిగే వాళ్ళం.



పడాకుల సుబ్బరామిరెడ్డి

నారావారిపల్లికి అనుకుని ఉండే ఏ.రంగంపేట వాసి పడాకుల సుబ్బరామిరెడ్డి. చంద్రగిరి జిల్లా పరిషత్ హైస్కూల్లో చంద్రబాబుతో కలసి చదువుకున్నారు. తర్వాత మళ్ళీ తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో కలసి డిగ్రీ చదివారు. సన్నిహిత మిత్రుడు. రాజకీయాల్లో కూడా చంద్రబాబు వెన్నంటి నడిచారు. ఏ.రంగంపేటకు గతంలో టీడీపీ తరపున ఎంపీటీసీగా కూడా గెలిచారు. ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటూ గ్రామంలోనే నివసిస్తున్నారు.

పాస్ చేయలేదని స్కూలే మారిపోయినాడు

చంద్రగిరి హైస్కూలులో చంద్రబాబు చదివింది తొమ్మిది దాకానే. తొమ్మిదో తరగతి పరీక్షల్లో చంద్రబాబుకి మ్యాథ్స్‌లో పాస్ మార్కుల కంటే ఒక మార్కు తగ్గింది. పదహైదు ఇరవై మందిమి కలసి హెడ్‌మాస్టర్ పద్మనాభరెడ్డి దగ్గరికి పోయినాం. ఒక్క మార్కే..సార్.. పాస్ చేయండి సార్.. అని బతిమిలాడినాం. ఆయన మొండోడు. కాదనేసినాడు. ఇంక ఊళ్ళో పెద్దోళ్ళంతా కలసి ఆర్ ఎంఎస్ నాయుడును కలిసి అడిగినారు. ఆయనా కుదరదనేసినాడు. దీంతో చంద్రబాబు 'నాకు చంద్రగిరి హైస్కూలే వద్దు' అని టీసీ తీసుకునేసినాడు. తిరుపతిలో టీపీపీఎం హైస్కూల్లో చేరిపోయినాడు. చంద్రబాబుకు అంత పౌరుషం, పట్టుదల వుండేది.

మా సైకిలు జోరు

చంద్రబాబుకు వాళ్ళ నాయన తొమ్మిదో తరగతిలో కొత్త సైకిల్ కొనిచ్చినాడు. నాకు ఎనిమిదిలోనే సైకిల్ కొనిచ్చినారు. చంద్రబాబు, నేను ఇద్దరం కొత్త సైకిల్ మీద తెగ తిరిగేవాళ్ళం. అప్పట్లో చంద్రగిరి హైస్కూల్లో సరస్వతీ పూజకి పూలు తేవల్లా అని టీచర్లు చెప్పినారు. ఇంకేం కొత్త సైకిలు ఉండనే ఉంది. రయ్యిమని ఇద్దరం నారావారి పల్లికి చేరుకున్నాం. పుల్లయ్యగారిపల్లి కాలవలో గన్నేరు పూలు, మొగిలి పూలు పెరుక్కుని తిరిగి స్కూలుకు బయల్దేరినాము.ఎ.రంగంపేట దాటినాక జోడు బావుల దెగ్గిర సైకిల్ మీద నుంచీ పడిపోయినాం. ఇద్దరం ఒళ్లంతా దెబ్బలు తగిలించుకున్నాం. ఆ దినం కుంటుకుంటా పోతే స్కూల్లోనూ, ఇంట్లోనూ కూడా తిట్లు తప్పలా.

పీయూసీలోనే జన్మభూమి

చంద్రబాబు సీఎం అయినాక శ్రమదానం, జన్మభూమి కార్యక్రమాలు పెట్టింది రాష్ట్రంలో అందరికీ తెలుసు. అయితే మేము చదువుకునేటప్పుడే మా పల్లెల్లో అభివృద్ధి పనులకు శ్రమదానం చేయించాడు చంద్రబాబు. శేషాపురం, కందులవారిపల్లి, నారావారిపల్లి,ఎ.రంగంపేట గ్రామాల మీదుగా కొంటి కాలువ, బాపన కాలువ పారేవి. పీయూసీలో వుండగా అప్పటికి ఈ రెండు కాలువలూ పూడిపోయి, ముండ్ల చెట్లు పెరిగిపోయినాయి. కాలువలు కనిపించకుండాపోయాయి. అది చూసి చంద్రబాబు మమ్మల్నందరినీ పుడ్డ చేసి శ్రమదానంతో కాలువలు బాగు చేయిచ్చినాడు. అంతా పిల్లోల్లమే.. కాలవల్లోకి దిగి పూడిక తీసి, చెట్లన్నీ కొట్టేసి తిరిగి నీళ్ళు పారేదానికి అనువుగా చేసినాము.

ఎన్టీయార్ అల్లుడు.. ఒకప్పుడు ఏఎన్ఆర్ అభిమాని

చంద్రబాబు సాక్షాత్తూ ఎన్టీయార్ అల్లుడు. అయినా సినీ రంగంలో ఆయన ఫేవరెట్ హీరో అక్కినేని. వినడానికి విచిత్రంగా అనిపించినా ఇది నిజం. తిరుపతిలో పీయూసీ చదివే రోజుల్లో అక్కినేని నాగేశ్వరరావు సినిమా రిలీజైందంటే చాలు ఎక్కడున్నా మొదటి రోజు మొదటి షో చూడాల్సిందే. పదీ ఇరవై మంది స్నేహితులతో కలసి గుంపుగా వెళ్ళే వాళ్ళం. తిరుపతి ప్రతాప్ థియేటర్‌లో టికెట్ కౌంటర్ వాళ్ళను దబాయించి మరీ టికెట్లు తీసుకుని సినిమా చూసేవాళ్ళం.

రెండూళ్లలో పెరిగిన బిడ్డ

నారావారిపల్లికి, కందులవారిపల్లికి మధ్య పొలాలే అడ్డు. ఫర్లాంగు దూరానికి మించదు. మా అమ్మ, నాయన, మా అన్నలు ఇద్దురూ (చంద్రబాబు అమ్మమ్మ, తాత, మేనమామలు) చంద్రబాబును మురిపంగా చూసేవాళ్ళు. తక్కువంటే రోజులో రెండు సార్లన్నా ఆటికీ ఈటికీ తిరుగులాడేవాడు. రెండూర్లలో పెరిగినాడు.

మహర్జాతకుడు

చంద్రబాబు పుట్టింది తిరుపతి ప్రభుత్వాస్పత్రిలో...

మాది కందులవారిపల్లి. నారావారిపల్లికి ఫర్లాంగు దూరంలో వుంటుంది. మా అక్క అమ్మణ్ణమ్మను నారావారిపల్లిలో ఇచ్చినారు. మా ముగ్గురు అన్నదమ్ముల్లో నేనే కడగొట్టు. అప్పటికి నేను పసోన్ని. అక్కకు సాయంగా వుండమని నన్ను నారావారిపల్లికి పంపిచ్చిరి. చంద్రబాబు పుట్టింది తిరపతి ప్రభుత్వాస్పత్రిలో. అప్పటికి రుయాస్పత్రి లేదు. చంద్రబాబుకు, నాకు వయసులో పెద్ద అంతరం లేదు. వాళ్ళింట్లోనే ఇద్దరం కలిసి పెరిగినాము. మా అక్క వాళ్ళది నా చిన్నతనంలోనే పెద్ద సేద్యం. పది ఆవులతో పాటు ఎనుములు, గొర్రెలు, పొట్టేళ్ళు వుండేటివి. గొర్రెలు, పొట్టేళ్ళు మేపే పని నాదే.

సాప మీద చంద్రబాబు... ఇంట్లోకి దూరిన పాము

చంద్రబాబు రోజుల బిడ్డగా వున్నపుడు కందులవారిపల్లిలోని మా ఇంట్లోనే అక్క వుండేది. ఇంట్లో సాప మీద చంద్రబాబును పడుకోబెట్టి బయట పనులు చేసుకుంటా వుంటే నాగుపాము ఇంట్లోకి దూరింది. ఆడోళ్ళంతా భయపడి గగ్గోలు పెట్టారు. మగోళ్ళు వచ్చి పామును పట్టి బయటకు తీసుకెళ్ళారు. దాని గురించి ఆడోళ్ళు గుర్తు చేసుకుని చెప్పుకునేది. అప్పట్లోనే వానికి (చంద్రబాబుకు) ఏందో మహర్జాతకం వుందనే వాళ్ళు.

రెండేండ్ల వయసులో నీళ్ళ తొట్టిలో పడిపోయినాడు!

రెండేండ్ల వయసులో చంద్రబాబు నీళ్ళ తొట్టిలో పడిపోయినాడంట. వాళ్ళ చిన్నాయన గభాల్న బయటకు తీసినాడంట. ఆ తీసేటబ్బుడు తలకిందలుగా కాళ్ళు పట్టుకుని ఎలదీసినాడంట. దానికి వాళ్ళ నాయన 'తలకిందలగా కాళ్ళు పట్టుకుని పైకెత్తతావా నా బిడ్డని' అని తమ్ముని మీద గలాటకు పోయినాడంట.

చంద్రబాబు నొస్టన గాయం!

ఓ రోజు మా బావ ఖర్జూర నాయుడు సంతకు పోయుండి టెంకాయ తెచ్చినాడు. అప్పుడు నాకు పన్నెండేండ్లు వుంటాయి. చంద్రబాబుకు ఏడేండ్లు వుంటుంది. ఇంటి ముందర తిన్నె మీద టెంకాయ గొట్టినా. పగిలి సగం చిప్ప పైకి ఎగిరింది. అది పొయ్యి చంద్రబాబుకు నొస్టన తగిలింది. నెత్తురు బొడబొడా కారింది. అదిజూసి నాకు భయం పెరుక్కునింది. మా అక్కా బావ కొడతారేమో నని దూరంగా పరిగెత్తుకునిపోయినా. ఇప్పటికీ చంద్రబాబుకు నొస్టన ఆ మచ్చ కనిపిస్తుంది.



కనుమూరి చిన్నబ్బ నాయుడు

చంద్రబాబుకున్న ముగ్గురు మేనమామల్లో అందరికంటే చిన్నవాడు కనుమూరి చిన్నబ్బ నాయుడు. అక్కకు సాయంగా వుండేందుకు పసితనంలోనే కందులవారిపల్లి నుంచీ నారావారిపల్లిలోని అక్క ఇంటికి పంపించారు తల్లిదండ్రులు. చంద్రబాబు కంటే వయసులో ఐదేళ్ళు పెద్దవాడు. అక్క కుటుంబానికి సేద్యంలోనూ, పశుపోషణలోనూ, ఇంటి పనుల్లోనూ సాయంగా నిలిచి ఆ ఇంట్లోనే కుటుంబసభ్యుడిగా పెరిగిన మనిషి. చంద్రబాబు పుట్టింది మొదలు ముఖ్యమంత్రి అయ్యేవరకూ అన్నింటికీ ప్రత్యక్ష సాక్షి. చంద్రబాబు చదువు నుంచీ రాజకీయాల వరకూ అన్నింటా చేదోడువాదోడుగా మెలిగిన వ్యక్తి. ప్రస్తుతం నారావారిపల్లెలో వ్యవసాయం చేసుకుంటున్నారు.



చంద్రబాబు చదువుకున్న బడి

ప్రతి శనివారం అడ్డదావన కొండకు

శనివారం వచ్చిందంటే అందురం కొండకు పోవల్సిందే. పెద్దా చిన్నా అంతా గుంపుగా బయల్దేరేది. నారావారిపల్లి నుంచీ ఉత్తరంగా అడ్డదారిన అడివి గుండా శ్రీవారి మెట్టు చేరుకుని అక్కడ నుంచీ మెట్ల దారిన కొండ ఎక్కుతా వుంటిమి.స్వామి దర్శనం చేసుకుని మళ్ళా అదే దావన ఇంటికి చేరుకుంటా వుంటిమి.తిరుమల శనివారాలు వస్తే ప్రతి శనివారం పల్లిలో వాళ్ళు, చుట్టుపక్కల పల్లెల నుంచీ వచ్చే వాళ్ళతో కలసి గోయిందలు పెడతా కొండకు పోతా వుంటిమి. ఇంటి కాడ పెద్దోళ్ళు మనిషికి అర్ధరూపాయి,రూపాయి లెక్కన ఇచ్చేవాళ్ళుమేము అది కూడా కర్చుపెట్టకుండా అట్నే ఎనిక్కి తెస్తావుంటిమి. కాలేజీలో చేరేదాకా చంద్రబాబు ప్రతి శనివారం కొండకు మాతో పాటు వచ్చేది.

ఎజ్డీ డబులింజను బైకు బుల్లోడు



నారా సుబ్రమణ్యం నాయుడు

చంద్రబాబు స్వంత చిన్నాన్న అయిన నారా చిన్న పాపయ్యనాయుడు కొడుకు నారా సుబ్రమణ్యం నాయుడు. వయసులో ఐదేళ్ళు చిన్నవాడు. బాల్యంలో ప్రతి అడుగులో చంద్రబాబు వెన్నంటి నడిచిన వాడు. వ్యవసాయ బావుల్లో ఈతాడినా, తిరుమల కొండకు నడిచి వెళ్ళినా, చుట్టుపక్కల ఊళ్ళలో జల్లికట్టు చూసినా, ఎన్నికల్లో ప్రచారానికైనా... అన్న తోడు వదలని తమ్ముడు. కోర్టులో ఉద్యోగం చేసి రిటైరయ్యారు. ప్రస్తుతం నారావారిపల్లిలోనే నివాసం.

మడక దున్నేవాడు!

చంద్రబాబు మా సొంత పెద్దనాయన కొడుకు. నాకంటే ఐదేండ్లు పెద్దోడు.వ్యవసాయ పనులు బాగా చేసేవాడు. చెరుకు సాగుకు వెనక మడక దున్నడం, కోతల య్యాక వాది కట్టడం వంటి పనులు చేసేవాడు. అప్పట్లో చెరుకు గానుగ రెండు నెలలు ఆడతావుంటిమి.గానుగలో చెరుకు పెట్టే పని కూడా చంద్రబాబు ఇష్టంగా చేసేవాడు. అయితే ఇంట్లో వాళ్ళు చంద్రబాబుకు పెద్దగా సేద్యం పనులు చెప్పేవాళ్ళు కాదు. మేనమామలు కూడా ఆయన్ను బాగా ప్రేమగా చూసుకునేవారు.

పొట్టేళ్ళమ్మిన ఖర్జూర నాయుడు

చంద్రబాబు చదువుకునేటప్పటికి వాళ్ళకు పది ఆవులతో పాటు ఎనుములు, గొర్రెలు, పొట్టేళ్ళు వుండేవి.వాటిని నేనే మేపతా వుంటి. మళ్ళ రాత్రానూ మా పెద్దనాయన మనం మేపలేములేరా అని పాలికి వదిలేది మొదులుపెట్టినాడు. చంద్రబాబు తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసినపుడు మనకెందుకని మా పెద్దనాయన ఏమాత్రం అడ్డం చెప్పలేదు. వున్న పొట్టేళ్ళన్నీ అమ్మేసి 'ఎలక్షన్లలో ఖర్చు పెట్టుకో నాయనా' అని రూ. 60 వేలు ఇచ్చినాడు. అప్పటికి ఇంట్లో రెండు లోడ్ల బెల్లం స్టాకు వుంది. అయితే రేటు లేదని బెల్లం అమ్మలేదు. లేకపోతే అదిగూడా ఇచ్చేసి ఉండేవాడు.

ఈత నేర్పించింది చంద్రబాబే!

చదువుకునేటప్పుడు ఎండాకాలం వచ్చిందంటే చాలు పిల్లోల్లందరం బావులకాడికి పరిగెత్తేవాళ్ళం.గంటల కొద్దీ ఈతాడేవాళ్ళం. మా ఊరి పక్కనే తెల్లాకల శెట్టి బావి వుంది. ఆ బాయిలోనే అందరం ఈతాడేది. నా చిన్నప్పుడు ఊర్లో పిల్లకాయలందరినీ చంద్రబాబే వెనకంటీ పెట్టుకోని బాయి కాడకు పిల్చకపోయేవాడు. అప్పట్లో పిల్లోల్లకు ఈత నేర్పించింది ఆయనే.

పీజీలో ఎజ్డీ డబులింజన్ బైక్

చంద్రబాబు తిరపతిలో పీజీ చేసేటపుడు ఎప్పుడు చూసినా వెనకంటీ పదీ ఇరవై మంది పిల్లోల్లు వుండేది. ఎప్పుడన్నా ఇంటికొస్తే కూడా వెనకంటీ పది మందికి తక్కువ లేకుండా వచ్చేవాళ్ళు. మా పెద్దనాయన కొడుకును అట్ల చూస్తే చానా సంతోషపడిపోయేవాడు. కొడుకు నలుగురిలో దర్జాగా వుండల్లని ఎజ్డీ బైక్ కొనిచ్చినాడు. అది డబులింజన్ బండి. బుల్లెట్ కంటే ఎక్కువ సౌండ్ వచ్చేది. బడబడమని సౌండ్‌తో ఆ బండి మీద కొడుకు పోయేది చూసి మా పెద్దనాయన మురిసిపోయ్యేవాడు.

చంద్రబాబు కోసం ప్రచారానికి వందలమంది విద్యార్థులు

చంద్రబాబు 1978లో తొలిసారి ఎలక్షన్లలో పోటీ చేసినపుడు వెనకంటీ తిరిగిందీ, ప్రచారం చేసిందీ, ఇంటింటికీ పోయి ఓట్లడిగిందీ.. అంతా ఈడు పిలకాయలే. తిరపతి యూనివర్శిటీ నుంచే వందల మంది స్టూడెంట్లు ప్రచారానికి వచ్చినారు. ఇంటికాడ ఆడోళ్ళకు పులుసన్నం వండేదే పని. వాటిని పొట్లాలు కట్టి ప్రచారానికి పొయ్యే వాళ్ళకు అందిచ్చేది మా పని. ఎలక్షన్ చేసిందంతా పిల్లోల్లే.

బడికోసం జోలె పట్టాడు

శ్రమదానంతో సొంతూరికి రోడ్డు

నారావారిపల్లి నుంచీ మా కందులవారిపల్లి అర కిలోమీటరు దూరంలో వుంటుంది. మేమిద్దరం శేషాపురంలో ప్రైమరీ స్కూలు, తర్వాత తిరుపతిలో పీయూసీ, డిగ్రీలలో క్లాస్‌మేట్స్. అంతకంటే దగ్గర బంధువులం కూడా. దాని వల్ల చిన్నప్పటి నుంచీ కలసి పెరిగాము. కలసి చదువుకున్నాం. చంద్రబాబుతో జ్ఞాపకాలు ఒకటా రెండా?

రోడ్డు బాగయ్యింది

చంద్రబాబు పీజీ పూర్తి చేశాక 1977లో యూత్ కాంగ్రెస్‌లో చురుగ్గా పనిచేశాడు.ఆ సంవత్సరంలోనే పులిచెర్ల సమితి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు. శ్రమదానంతో గ్రామాల్లో యువత అభివృద్ధి పనులు చేపట్టాలని అప్పట్లో సంజయ్ గాంధీ పిలుపిచ్చారు. దానిని చంద్రబాబు పట్టుదలగా తీసుకున్నాడు. అప్పట్లో ఎ.రంగంపేట నుంచీ నారావారిపల్లి, శేషాపురం మీదుగా భీమవరం వరకూ ఐదు కిలోమీటర్ల రోడ్డు చాలా అధ్వానంగా వుండేది. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు పోవడం కూడా కష్టమయ్యేది. రోడ్డంతా బురదగా వుండేది.చంద్రబాబు స్నేహితులందరినీ పోగేసి ఈ రోడ్డు బాగు చేసే పనికి పూనుకున్నాడు. అందరం నడుములు వంచాం.ఆయా గ్రామాల్లోని యువకులు వచ్చి కలిశారు. ఇలా ఐదు కిలోమీటర్ల రోడ్డు బాగు చేశాం.

హైస్కూలు కోసం జోలె పట్టుకున్నాడు

ఎ.రంగంపేటలో అప్పర్ ప్రైమరీ స్కూలు మాత్రమే వుండేది. పిలకాయల పై చదువులకు ఇబ్బందిగా వుండేది. చంద్రగిరికి పోవల్లంటే వంకలు, కాలవలు దాటల్ల. తిరుపతి పోవల్లంటే దూరాభారం. దాన్ని హైస్కూలుగా అప్‌గ్రేడ్ చేయాలని పెద్దోళ్ళంతా కలిసి చిత్తూరులో జడ్పీ ఆఫీసుకు పోయి అర్జీ ఇచ్చినారు. రూ. 8 వేలు కార్పస్ ఫండ్ కడితే అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పినారంట. అంత దుడ్లు ఎవురిచ్చేది? చంద్రబాబు అప్పుడు తిరుపతిలో పీజీ చేస్తా ఉండాడు. మమ్మల్నందరినీ కలుపుకున్నాడు. రంగంపేట నుంచీ నారావారిపల్లి, కందులవారిపల్లి, శేషాపురం, భీమవరం దాకా జోలి పట్టుకుని తిరిగితే రూ. 5 వేలు వసూలైంది. తక్కువ పడిన మిగతా డబ్బు మేమందరం తలాకొంత వేసుకుని జడ్పీలో కట్టినాం.దాంతో రంగంపేట అప్పర్ ప్రైమరీ స్కూలు హైస్కూలు అయ్యింది.

కోళ్ళ ఫారం డబ్బంతా శీనయ్య మెస్‌కే!

చంద్రబాబుకు చుట్టూ దండిగా స్నేహితులుండాల్సిందే. పీయూసీ రోజుల నుంచీ ఇంతే. స్నేహితుల్లో ఎవరి చేతిలో డబ్బులున్నా అందరం పోలోమని శీనయ్య మెస్సుకు పోయి తినేసేది.డిగ్రీలో చేరినాక ఫ్రెండ్స్ ఇంకా ఎక్కువైనారు. శీనయ్య మెస్సుకు పొయ్యేది కూడా ఎక్కువైంది. అప్పట్లోనే చంద్రబాబు నారావారిపల్లిలో కోళ్ళఫారం పెట్టినాడు. వెయ్యి కోళ్ళు వుండేవి. ఆ కోళ్ళు అమ్మిన డబ్బంతా శీనయ్య మెస్సుకే ఖర్చు పెట్టుంటాడు.

చంద్రగిరి ఓట్ల ఆచారమే మార్చేసినాడు

చంద్రగిరి నియోజకవర్గంలో చంద్రబాబు పోటీ చేయక ముందు దాకా ఎలక్షన్లలో పోటీ చేసిన నాయకులెవురూ ఇండ్లకు పోయి ఓట్లు అడిగిందే లేదు. ఊరికి ఒకరిద్దరు పెద్ద మనుషులుండేవాళ్ళు. వాళ్ళ ఇండ్లకు పోయి మాట్లాడుకోని వెళ్ళిపోయేవారు. ఆ ఊరి పెద్దలు చెప్పినట్టు ఊళ్ళో జనం ఓట్లు వేసేవాళ్ళు. 1978లో చంద్రబాబు ప్రతి ఇంటి గడపా తొక్కి ఓట్లు అడిగినాడు.ఇంటి ముందరకొచ్చి ఓటు అడిగినాడే అని చానా మంది ఆయనకు ఓట్లేసినారు.



కనుమూరి చంద్రశేఖర్ నాయుడు

కందులవారిపల్లికి చెందిన కనుమూరి చంద్రశేఖర్ నాయుడు చంద్రబాబుకు సన్నిహిత బంధువు. బాల్యం నుంచీ కలసి చదువుకున్నారు. శేషాపురంలో 1వ తరగతి నుంచీ 5వ తరగతి వరకూ, తర్వాత తిరుపతిలో పీయూసీ, డిగ్రీ కూడా కలసి చదివారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైరయ్యారు. ప్రస్తుత నివాసం కందులవారిపల్లిలో.

చదివేది ఆ రెండు నెలలే!

డిగ్రీ దాకా చంద్రబాబు యావరేజీ స్టూడెంటే. పీజీలో చేరాక చాలా మార్పు కనిపించింది. చంద్రబాబు చదివేది సంవత్సరంలో రెండు నెలలే. నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం. మిగతా టైమంతా తిరిగేదే. స్నేహితులందరం ఒక రూములోనే ఉడ్డగా ఉండేవాళ్లం. డిగ్రీ చదివేటపుడు తిరుపతి పొర్ల వీధిలో ఫ్రెండ్స్‌తో వుండేవాడు.పరీక్షలు దగ్గరికి రాగానే ఆకుతోట వీధిలో ఒక్కడే రూము తీసుకుని అక్కడికి వెళ్ళిపోయేవాడు. పట్టుదలగా చదివి 50 శాతానికి తగ్గకుండా మార్కులు తెచ్చుకునేవాడు.

మెజారిటీ నిధులు కేటాయించండి

16వ ఆర్థిక సంఘం చైర్మన్‌కు మేయర్ అముద విజ్ఞప్తి



చైర్మన్ అరవింద్‌కు నివేదికను ఇస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గురువారం జరిగిన 16వ ఆర్థిక సంఘం సమావేశానికి చిత్తూరు మేయర్ అముద హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్బన్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి సంబంధించిన ప్రతిపాదనలను ఆమె 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియాకు అందించారు. మెజారిటీ నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ నిర్వహించిన మేయర్లు, చైర్మన్ల సమావేశంలోనూ అముద పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఇష్టానుసారం వ్యవహరిస్తే ఆఫ్‌లైన్‌లో శిక్ష తప్పదు : ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ఇష్టానుసారం వ్యవహరిస్తే ఆఫ్‌లైన్‌లో శిక్ష తప్పదని ఎస్పీ మణికంఠ హెచ్చరించారు. సామాజిక మాధ్యమం ఒక మంచి సమాచారాన్ని పంచుకునే వేదికన్నారు. దీన్ని ఎవరి మనోభావాలూ ఇబ్బంది పడకుండా వాడుకోవాలే తప్ప.. కించపరిచేలా ఉపయోగించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని, అలాకాకుండా ఇష్టమొచ్చినట్లు ఉంటే.. శిక్ష తప్పదన్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాపింపచేయడానికి లేదా కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు ఉంటాయని గురువారం పేర్కొన్నారు.

ఆదరణ కరువైన వృద్ధులకు ఆశ్రయం

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆదరణ కరువైన వృద్ధులకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పిస్తామని రాష్ట్ర కవులు, కళాకారుల వృద్ధాశ్రమ సంఘం కార్యదర్శి నటరాజన్ చెప్పారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఏ ఆదరణ లేకుండా, అనాథలుగా మారిన వృద్ధులకు తమ ఆశ్రమంలో ఆశ్రయం కల్పిస్తున్నామని తెలిపారు. తిరుపతి, పాకాల, పుంగనూరు ప్రాంతాల్లో తమ ఆశ్రమాలు ఉన్నాయన్నారు. నిరాశ్రయులకు సంబంధించిన వివరాలపై సమాచారం ఇస్తే ఆశ్రయం కల్పిస్తామని తెలిపారు. ఇందుకోసం 8297816846, 8374044604 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పద్మావతి వర్సిటీకి ఐఎస్‌వో గుర్తింపు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీకి ఐఎస్‌వో గుర్తింపు లభించింది. రెండు రోజులుగా యూనివర్సిటీలో బోధన, పరిశోధన, విస్తరణ, పాలన తదితర అంశాలను ఐఎస్‌వో బృందం పరిశీలించింది. ఈ అంశాల్లో యూనివర్సిటీ అత్యంత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తోందంటూ కితాబిచ్చింది. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను వీసీ ఉమకు హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ ఆలపాటి శివయ్య అందజేశారు. దీంతో పాటు గ్రీన్ జోన్ ఎమ్సెరిగేట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. రిజిస్ట్రార్ ఎన్.రజని, ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ డైరెక్టర్ టి.త్రిపురసుందరి, టి.సీతాకుమారి (లా), ప్రొఫెసర్ జాన్ సుష్మా (బయో టెక్నాలజీ), పి.విజయలక్ష్మి, బీఎస్ నీలిమ (జర్నలిజం), డాక్టర్ నీరజ (ఉమెన్ స్టడీస్), పీఆర్వో డాక్టర్ శ్రీరజని తదితరులు పాల్గొన్నారు.

గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చేదెప్పుడు?

నీటి తీరువా సంఘాలకు ఎన్నికైనవారి ఆవేదన



మంగళం చెరువు

నగరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024 డిసెంబరు 14వ తేదీన నీటి తీరువా సంఘం ఎన్నికలను నీటి పారుదల శాఖ, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గెలుపొందిన వారికి అప్పటికప్పుడే ఫామ్-10 కాపీలను అందించారు. ఎన్నికలు జరిగిన 15 నుంచి 30 రోజుల్లోపు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. కానీ ఎన్నికలు పూర్తయి నాలుగు నెలలవుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో నీటి తీరువా సంఘాలకు ఎన్నికైన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెజిట్ నోటిఫికేషన్‌లో చెరువుకు ఎంపికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మెంబర్ల పేర్లతో కూడిన జాబితా ఉంటుంది. సంఘం పదవీకాలం ఎంత వరకు తదితర వివరాలూ ఉంటాయి. ఈ గెజిట్ నోటిఫికేసన్ వస్తేనే నీటితీరువా సంఘాలకు పూర్తి అధికారం వచ్చినట్లవుతుంది. జిల్లాలో 220 నీటితీరువా సంఘాలను ఎంపిక చేసుకోవడం జరిగింది. 215 చెరువులకు కృష్ణాపురం ప్రాజెక్టు పరిధిలో ఐదు సంఘాలను ఎన్నుకున్నారు.

నీటి తీరువా సంఘాలు ఏం చేస్తాయంటే..

'చెరువులకు అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు చేపట్టడం. గండ్లుపడినా, కాలువలు దెబ్బతిన్నా ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి మరమ్మతులు చేపట్టడం. ఆయకట్టు పరిధిలోని రైతులకు వంతులవారీగా నీటిని సరఫరా చేయడం. నీటి తీరువా పన్ను వసూలు చేయించి, ప్రభుత్వానికి కట్టడం. చెరువులో చేపలు వేలం వేయించి వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ పద్దులో జమ చేయించడం' వంటి పనులు చేస్తారు.

వాస్తవమే

గెజిట్ నోటిఫికేషన్ అయితే విడుదల కాని మాట వాస్తవమే. ఫామ్-10, పాస్‌బుక్కులను నీటితీరువా సంఘాలకు అందించడం జరిగింది. పాస్‌బుక్‌లుంటే చేపల వేలం వేసుకోవడానికి, పనులు చేపట్టడానికి అనువుగా ఉంటుంది.

- సుజాత, ఈఈ, నీటిపారుదలశాఖ

'పద్మ' అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఆహ్వానం

చిత్తూరు క్రీడలు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం ప్రతి ఏడాది గణతంత్ర దినోత్సవంలో భాగంగా అందించే 'పద్మ' అవార్డులైన పద్మ విభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీలకు అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో బాలాజి తెలిపారు. అర్హులైనవారు ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు డీఎస్‌ఏ కార్యాలయాన్ని సంప్రదించాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన సునీల్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన గురువారం రాత్రి పుంగ నూరులోని బైపాస్‌లో జరిగింది. పుంగనూరు మండలం రాగానిపల్లెకు చెందిన రెడ్డెప్పరెడ్డి కుమారుడు సునీల్(24) ద్విచక్రవాహనంలో పుంగనూరు నుంచి స్వగ్రామానికి బైపాస్ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ లోకేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృత దేహాన్ని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రోన్ వినియోగంపై శిక్షణ



డ్రోన్ వినియోగంపై శిక్షణ ఇస్తున్న కంపెనీ నిర్వాహకులు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగంపై జిల్లాలోని కిసాన్ డ్రోన్ గ్రూపు కన్వీనర్లకు, కో-కన్వీనర్లకు చిత్తూరులో గురువారం శిక్షణ ఇచ్చారు. డ్రోగో టెక్నాలజీస్, విహంగ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ డ్రోన్ల వాడకం, డ్రోన్ గ్రూపు అకౌంట్స్ ప్రారంభించడానికి లోను మంజూరు, సోషల్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల ద్వారా వచ్చే రాయితీలను వివరించారు. డ్రోగో టెక్నాలజీ గరిష్ఠ ధర రూ.9.80 లక్షలు కాగా, రాయితీ రూ.7.84 లక్షలు(విడి భాగాలతో), విహంగ టెక్నాలజీ గరిష్ఠ ధర రూ.9.81 లక్షలు కాగా, రాయితీ రూ.7.84 లక్షలు (విడి భాగాలతో) ఇవ్వనున్నట్లు తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేష్, ఎల్‌డీఎం హరీష్, డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు, ఎస్‌జీబీ ఆర్‌ఎం విష్ణు చరణ్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రభుత్వ భూములను పరిరక్షించండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ భూములను తహసీల్దార్లు పరిరక్షించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లకు ఒక్కరోజు వర్క్‌షాప్ జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. భూసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మ్యుటేషన్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పట్టా లేని భూమికి అనుభవపత్రం ఉంటే అట్టివారికి ప్రభుత్వం భూరెగ్యులరైజేషన్ చేసుకునేందుకు జీవో నెం.30 తీసుకొచ్చిందని చెప్పారు. ఈ జీవో ద్వారా పట్టాలేని భూములకు ఈ ఏడాది ఆఖరులోగా క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించాలన్నారు. భూఅలైనేషన్, అసైన్మెంట్ భూమి, రెగ్యులరైజేషన్, ఆర్వోఆర్, 22ఏ, వెబ్‌ల్యాండింగ్, రీసర్వే వంటి సమస్యలను ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పరిష్కరించాలని ఆదేశించారు. వెబ్‌ల్యాండ్ కరెక్షన్ సమయంలో తహసీల్దార్లు.. రికార్డులతో పాటు క్షేత్రస్థాయిలోనూ పరిశీలించాలన్నారు. జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీవోలు పాల్గొన్నారు.

క్రీడారంగానికి పెరిగిన ప్రాధాన్యం

ఆర్‌ఐపీఈఈ భానుమూర్తిరాజు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి ప్రాధాన్యత ఇవ్వడంతో 2024-25 విద్యాసంవత్సరంలో జాతీయస్థాయిలో రాష్ట్రానికి 48 అవార్డులు వచ్చాయని రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ భానుమూర్తిరాజు తెలిపారు. చిత్తూరులో గురువారం ఆయన మాట్లాడుతూ 2025-26వ విద్యా సంవత్సరంలో నిర్వహించే స్కూల్ గేమ్స్‌కు రాష్ట్రప్రభుత్వం రూ.7.40 కోట్లు మంజూరు చేసిందని వివరించారు. వీటిని అన్ని జిల్లాల సమగ్రశిక్ష కార్యాలయాలద్వారా ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. అండర్- 14,17,19 విభాగాల కింద మండల, డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయిలో వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొనే విద్యార్థులకు దుస్తులు, భోజన వసతి, కిట్లు, ట్రావెలింగ్ అలవెన్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈఏడాది ఆగస్టు 29న జిల్లాకు ఐదుగురు చొప్పున రాష్ట్రంలోని 130 మంది క్రీడాకారులకు ప్రతిభా అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇకపై పీడీలు కేవలం స్కూల్ గేమ్స్ మినహా అసోషియేషన్ల తరపున నిర్వహించేక్రీడల్లో పాల్గొనేందుకు ఆన్‌డ్యూటీ(ఓడీ)వర్తించదని స్పష్టం చేశారు.

విశ్వం వేసవి శిక్షణ సమాచార పత్రిక ఆవిష్కరణ



సమాచార పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విశ్వం వేసవి శిక్షణ శిబిర సమాచార పత్రికను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖరరెడ్డి గురువారం ఆవిష్కరించారు. వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాలయంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, మిలటరీ, నవోదయ, పాలిటెక్నిక్ పోటీ పరీక్షలకు విశ్వం విద్యాసంస్థలు 35 సంవత్సరాలుగా అత్యుత్తమ శిక్షణనిస్తూ మంచి ర్యాంకులు సాధిస్తోందన్నారు. విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా కాకుండా పిల్లల భవిష్యత్తు దృష్ట్యా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.మరింత సమాచారానికి 9399976999, 868888880లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అపుస్మా నాయకులు భాస్కర్‌రాజు, రామకృష్ణారెడ్డి, ఎస్.ఎం.బాషా, రఘునారాయణరావు, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్ బాబు పాల్గొన్నారు.

తిరుపతిలో హైడ్రామా

● టీటీడీ గోశాల చుట్టూ రాజకీయ రగడ



గోశాల సందర్శిస్తున్న ఎమ్మెల్యేలు, కూటమి నేతలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గురువారం ఉదయం హైడ్రామా చోటుచేసుకుంది. టీటీడీ గోశాలలో వందకుపైగా ఆవులు మృతి చెందాయన్న భూమన ఆరోపణల నేపథ్యంలో వివాదం రాజుకుంది. గోశాల సందర్శనపై సవాళ్లు.. ప్రతిసవాళ్లతో రాజకీయం వేడెక్కింది. గోశాలను కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, నేతలు సందర్శించారు. గుంపుగా కాకుండా ఐదుగురు నేతలు, వారి వ్యక్తిగత భద్రతా సిబ్బంది మాత్రమే గోశాలకు రావాలని పోలీసులు సూచించినా టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకర రెడ్డి మాత్రం గుంపుగా బయలుదేరారు. వీరిని పోలీసులు అడ్డుకోవడంతో హైడ్రామా చోటుచేసుకుంది.

భారీగా మోహరించిన పోలీసులు

అటు వైసీపీ.. ఇటు కూటమి పార్టీల నేతలు తిరుపతిలోని టీటీడీ గోశాల సందర్శన నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఇళ్ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గోశాలలోకి కూటమి నేతలు వెళ్లి వారు బయటకు వచ్చాక.. వైసీపీ నాయకులను అనుమతిస్తామని ఎస్పీ ప్రకటించారు. దీంతో ఎక్కడా పరిస్థితి అదుపు తప్పకుండా ముందస్తుగా వారి ఇళ్ల వద్ద పోలీసులు మోహరించారు. ఎస్పీ అనుమతులు లేనిదే వారిని ఇళ్లలో నుంచి బయటకు రానీయకుండా ముందస్తు భద్రత ఏర్పాటు చేశారు. రెండు పార్టీల నేతలను వేర్వేరుగా.. శ్రేణులతో కాకుండా పరిమిత సంఖ్యలోనే అనుమతిస్తామని ఎస్పీ హర్షవర్ధనరాజు స్పష్టంచేశారు. కానీ, మందీమార్బలంతో తన ఇంటి నుంచి బయలుదేరిన భూమనను అక్కడే అడ్డుకున్నారు. ఇక, గోశాల ప్రవేశ ద్వారం వద్ద పూర్తిస్థాయిలో నిఘా పెట్టారు. ఎస్పీతో పాటు ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీలు భక్తవత్సలం , చెంచుబాబు , కొందరు సీఐలు గోశాలలోనూ కూటమి నేతల వెంటే ఉన్నారు. మధ్యాహ్నం 1.26 గంటలకు గోశాల నుంచి వీరంతా బయటకు వచ్చారు. ఇక, భూమన అభినయ్ గోశాల వద్దకు వచ్చినా లోపలకు అనుమతించలేదు. దీనిపై అతను ఆందోళనకు ఉపక్రమించే ఆలోచన ఉందని తెలుసుకున్న పోలీసులు.. అతడిని అదుపులోకి తీసుకుని ఇంటి వద్ద వదలిపెట్టారు. ఇక, గోశాల వద్దకు వచ్చిన ఎంపీ గురుమూర్తికి, కూటమి ఎమ్మెల్యేలకు మధ్య కొంతసేపు వాగ్వాదం నడిచింది. ఎస్పీ జోక్యం చేసుకుని ఎంపీని లోపలకు పంపడంతో వివాదం సద్దుమణిగింది.

కరుణాకరరెడ్డిపై కేసు నమోదు

టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్వీయూ వర్సిటీ సీఐ రామయ్య తెలిపారు. టీటీడీ గోశాలపై అసత్య ఆరోపణలు చేస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీశారని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ నాయకులు బుధవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ కావడంతో గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

వైసీపీ హంగామా



తన ఇంటి ముందు రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతున్న భూమన

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పార్టీ శ్రేణులు, నేతలతో కలిసి బయలుదేరిన తనను పోలీసులు అడ్డుకున్నారంటూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నేలపై పడుకుని నిరసన తెలిపారు. ఉదయం 9.30 నుంచి 45 నిమిషాలకు పైగా ఈ నిరసన చేపట్టారు. గోశాల ఘటనపై ఇంత జరుగుతున్నా సనాతన ధర్మం అంటూ మాట్లాడే పవన్ ఎందుకు మాట్లాడటం లేదని మాజీ మంత్రి రోజా ప్రశ్నించారు. గోశాలకు వెళ్లాలనుకున్న భూమనను పోలీసులు అడ్డుకోవడం మంచి పద్ధతి కాదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఈ ఏడాది మార్చి వరకు 191 ఆవులు చనిపోయాయంటూ గోశాల మేనేజరు అధికారికంగా ప్రకటన విడుదల చేశారంటూ మీడియాకు భూమన కరుణాకరరెడ్డి చూపారు. గోశాలకు ఎప్పుడైనా రావడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, భూమన అభినయ్, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉంటే ఆయనకు నచ్చదు

తిరుపతి ప్రశాంతంగా ఉండడం ఆయనకు ఇష్టం ఉండదు. ఆయన అరాచకాలన్నీ ప్రజలకు తెలుసు. భూమన డ్రామా రికార్డు ఇక్కడ అరిగిపోయింది. వేరేచోటకు వెళ్లి నాటకాలు వేసుకుంటే మంచిది.

- ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే తిరుపతి

హిందుత్వంపై దాడికి ముందుంటుంది

గతంలో పింక్ డైమెండ్.. ఇప్పుడు టీటీడీ గోశాల మీద పడ్డారు. ఇలా హిందుత్వంపై దాడికి వైసీపీ ఒంటికాలిపై లేస్తుంటుంది.గోశాలకు రాకుండా రోడ్డుపై కరుణాకర్‌రెడ్డి డ్రామాలువేయడం సరికాదు.

- పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే

రాజకీయ లబ్ధి కోసమే

ఏ జీవరాశికైనా జనన,మరణాలు సాధారణం. విజిలెన్స్ నివేదిక చూస్తే గోవుల మరణాలకు గత నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తోంది. రాజకీయ లబ్ధికోసమే వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోంది.

- థామస్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే

ఆయన రాజకీయం పరిసమాప్తం

ప్రజలు, ప్రకృతి, కుల, మతాలతో నీచ రాజకీయాలు చేసిన వైసీపీ పవిత్ర గోశాలనూ వదిలిపెట్టలేదు. ఇంతటితో భూమన రాజకీయం పరిసమాప్తమైనట్లే. గోమాతకు క్షమాపణ చెబితే కొంత ప్రాయశ్చిత్తం వస్తుంది.

- మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

'స్థానిక సంస్థల' పరిపుష్టికి నిధులు పెంచండి

● 16వ ఆర్థిక సంఘానికి ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి



ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న అరవింద్ పనగారియా

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర విభజనతో నష్టపోయాం. కేంద్ర నిధులు మరింత పెంచి స్థానిక సంస్థలను ఆదుకోండి' అంటూ 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియాకు పలువురు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో గురువారం చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియా నేతృత్వంలో సభ్యులు అన్నే జార్జి మథ్యూ, డాక్టర్ మనోజ్ పాండా, రిత్విక్ పాండే, కేకే మిశ్రా, అమృతచ, ఆదిత్య పంత్, జ్యోతి నాగర్కోటి, అభయ్‌మీనన్ గ్రామీణ, పట్టణ ప్రాంతాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. కేంద్ర సహకారంతో సోలార్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయండి. తద్వారా మున్సిపాలిటీల్లో విద్యుత్ భారం తగ్గుతుంది. ఆ నిధులను మౌలిక వసతులకు వినియోగిస్తాం' అని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఏటా ఆర్థిక సంఘం ఇచ్చే నిధులు మరింత పెంచాలని సత్యవేడు జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతల్లో పెరిగిన జనాభా నిష్పత్తి ప్రకారం ఆర్థిక సంఘం నిధులు పెంచితే స్థానిక సంస్థలు ఆర్థికంగా బలోపేతమవుతాయని తిరుపతి రూరల్ చెర్లోపల్లి సర్పంచ్ సుభాషిణి అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలను నిర్మించడం ద్వారా వచ్చే ఆదాయంతో పల్లెలను అభివృద్ధి చేసుకోవచ్చని ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీం పట్నం ఎంపీపీ జ్యోత్స్న అన్నారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు ఈసారి వచ్చే ఆర్థిక సంఘం నిధులు పెంచాలని పంచాయతీ, మున్సిపాలిటీ, నగరపాలకసంస్థ కార్యాలయాలకు సోలార్ ప్రాజెక్టులకు నిధులు మంజూరుచేయాలని స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రత్నకుమారి ఆర్థిక సంఘాన్ని కోరారు. మీ సలహాలు, సూచనలు, అభిప్రాయలను కమిషన్ పరిశీలిస్తుందని 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియా తెలిపారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల నుంచి 33 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

గిరిజాపురంలో తాగునీటి కష్టాలు..!



ఖాళీ బిందెలతో మహిళలు

చౌడేపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గిరిజాపురంలో నెల రోజుల నుంచి గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెల రోజుల క్రితం గ్రామానికి తాగునీరు సరఫరా చేసే మోటర్ కాలిపోయింది. అప్పటి నుంచి అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. తాము తాగునీటి కోసం గ్రామం నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుమార్‌రెడ్డి కోళ్లఫారం వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి బోరుకు మర్మతులు చేయించాలని కోరుతున్నారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి



స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో ఎంఈవోలు

కల్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, అంకిత భావం పెంపొందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో అవసరమని ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ పీఎంశ్రీ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. స్కౌట్స్ శిక్షణతో విద్యార్థుల్లో శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక వికాసం సమకూరుతాయని తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ కెప్టెన్లు రాజశేఖర్, విమలా విక్టోరియా, ఉపాధ్యాయులు రాజేంద్ర, వెంకటశిద్దులు, వేణుగోపాల్, రహమత్‌బాషా, చంద్రబాబు, పద్మవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే ఉత్తమ బోధన



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

సోమల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో పిల్లలకు ఉత్తమ విద్యాబోధన ఉంటుందని ఎంఈవో శివరత్న అన్నారు. గురువారం సోమల ప్రాథమిక పాఠశాలలో బడి ఈడు పిల్లలను చేర్పించాలని ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల వివరాలను సేకరించి ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎల్లయ్య, సురేష్, బేబీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో నారాయణ

సోమల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రంగా ఉండేలా ప్రజలు సహకరించాలని.. శుభ్రతతోనే ఆరోగ్యకరంగా ఉంటారని ఎంపీడీవో నారాయణ పేర్కొన్నారు. గురువారం కందూరు పంచాయతీలో చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. గ్రామాల్లోని చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి సేంద్రియ ఎరువుల తయారీతో పంచాయతీలకు ఆదాయాన్ని చేకూర్చాలన్నారు. అనంతరం వర్మీకంపోస్టు తయారీని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే సోమల, నెల్లిమందలో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో, ప్రిన్సిపాల్

సోమల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సోమల జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను ఎంఈవో శివరత్న, ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం చేయాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోటీశ్వరరావు, అధ్యాపకులు గౌతం, శివయ్య, వెంకటరమణ, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

10న జాతీయ లోక్ అదాలత్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 10వ తేదీన పుంగనూరు కోర్టు ఆవరణలో జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫా తెలిపారు. సివిల్, క్రిమినల్ కేసుల్లో రాజీకి అనువైన కేసులను రాజీ చేసుకోవాలని కోరారు.

గోమాతతో వైసీపీ రాజకీయాలు

పుంగనూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో గోమాతను లక్ష్మీదేవి స్వరూపంగా భావించడం హిందువుల సంప్రదాయమని, రాజకీయాల కోసం టీటీడీ గోశాలలో వంద గోవులు చనిపోయాయని వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని భారతీయ గోరక్ష మహాసంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.అయూబ్‌ఖాన్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గోమాతతో రాజకీయాలు చేయడం వైసీపీ నాయకులకు తగదన్నారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని పదేళ్ల టీటీడీ చైర్మన్‌గా నియమించడంతో తిరుమల ప్రతిష్ఠ దెబ్బతిందని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



నాగమంగళం వద్ద బోరు వేయిస్తున్న మున్సిపల్ కమిషనర్

పలమనేరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలో వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య పరిష్కారానికి ఓ కొత్త బోరు వేయడంతో పాటు మరో నాలుగు బోర్లను లోతు చేయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి తెలిపారు. పట్టణ సమీపంలోని కౌండిన్యనది ఒడ్డున నాగమంగళం వద్ద కొత్తబోరును గురువారం వేశారు. బోర్ల నుంచి ట్రాక్టర్లతో సంప్‌వరకు నీటిని సరఫరా చేసి శుభ్రం చేసిన తర్వాత పట్టణ ప్రజలకు అందిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పలమనేరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈనెల 20 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్. వి.రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు, ఆధార్‌కార్డుతో లింక్ అయిన ఫోన్ నంబరు, రేషన్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సచివాలయాల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

పలమనేరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలం కొలమాసనపల్లి సౌత్ పాఠశాలలో గురువారం 17 పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న సాకేవూరు ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు జయలక్ష్మి, కొలమాసనపల్లి సౌత్ పాఠశాలలో పనిచేస్తున్న త్రిలోక్ చందులను ఘనంగా సన్మానించారు. ఎంఈవో లీలారాణి, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కె.ఈశ్వరప్రసాద్, సీఆర్‌సీ జాయింట్ సెక్రటరీ ఎం.భాస్కర్, సీఆర్‌పీ రెడ్డెమ్మ పాల్గొన్నారు.

విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పలమనేరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని పలమనేరు సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ సూచించారు. గురువారం బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు సమగ్ర ఆరోగ్య పథకం కింద వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. సూపర్‌వైజర్ ఉషాకుమారి, అముద, పార్వతి, కృష్ణవేణి, జయంతి, అనీలా పాల్గొన్నారు.

రొంపిచెర్ల విద్యార్థికి రాష్ట్రస్థాయి అవార్డు



రొంపిచెర్లలో స్రవంతికి సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు

రొంపిచెర్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో రొంపిచెర్ల కేజీబీవీలో చదివిన స్రవంతికి రాష్ట్రస్థాయి అవార్డు వరించింది. విజయవాడలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌చే అవార్డు అందుకుంది. కర్నూల్ జిల్లా నుంచి తిరుపతికి వచ్చి కూలీ పనులకు వెళుతున్న దేవమ్మ, శివన్నల కుమార్తె స్రవంతి రొంపిచెర్ల కేజీబీవీలో సీఈసీలో 935 మార్కులు సాధించి ప్రతిభ చూపినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. గురువారం కళాశాలలో విద్యార్థినికి జ్ఞాపిక అందించి శాలువతో సత్కరించారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



సదుం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి సమూల నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సదుం ఎస్ఐ షేక్‌షావలి తెలిపారు. గంజాయి వాడకం, విక్రయం, కొనుగోలు తదితర అంశాల సమాచారం అందించేందుకు స్థానిక బస్టాండులో ప్రత్యేకంగా గురువారం క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. దీని వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ సయ్యద్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే పిల్లల ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఫమీదాబేగం

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పౌష్టికాహారంతోనే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారని పుంగనూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫమీదాబేగం పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఈడిగపల్లె అంగన్‌వాడీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు, ఆకు కూరలను సేకరించి వాటితో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్, టీడీపీ నాయకులు రాఘవ, రవికుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



రొంపిచెర్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం బెస్తపల్లిలో సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి సీతారాములకు సారె తెచ్చి కల్యాణోత్సవానికి హాజరయ్యారు. పురోహితులు మునిరాజశర్మ సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణాన్ని జరిపించారు.

అగ్నిప్రమాద నివారణ పరికరాలు అవశ్యం



కుప్పం: అగ్ని ప్రమాదాలపై పిల్లలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



పుంగనూరులో మాట్లాడుతున్న సుబ్బరాజు

కుప్పం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు తిరుగాడే పాఠశాలల్లో, వారు సంచరించే ఇతర ప్రాంతాల్లో అగ్ని ప్రమాద నివారణ పరికరాలు తప్పనిసరిగా ఉంచుకోవాలని కుప్పం అగ్నిమాపక కేంద్రం అధికారి డి.ప్రవీణ్ కుమార్ అన్నారు. అగ్ని ప్రమాద వారోత్సవాలలో నాలుగో రోజు గురువారం గుడుపల్లె మండలంలోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ స్కూల్‌లో పిల్లలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్యాస్ ఫైర్, ఆయిల్ ఫైర్‌కు సంబంధించి డెమో నిర్వహించారు. ఎవరైనా ప్రమాదంలో చిక్కుకున్నపుడు వారిని కాపాడే పద్ధతులు వివరించారు. అగ్ని ప్రమాద నివారణ పద్ధతులు వివరించే కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఆర్.మోహన్, జయ కుమార్, జి.నరేశ్, కె.కృష్ణయ్య, వి.విజయ, సి.రఘుపతి, కె.మణి, కె.రఘుపతి, సీకే.రామ్మూర్తి పాల్గొన్నారు.

● పుంగనూరు: వేసవిలో అగ్ని ప్రమాదాలు, ఈతకు వెళ్లే సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని పుంగనూరు ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు సూచించారు. గురువారం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా స్థానిక ఓ ప్రవేటు పాఠశాలలో విద్యార్థులకు జాగ్రత్తలను వివరించారు. అగ్నిమాపక సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గంగవరం: విద్యార్థులు చదువుతోపాటు ఏదైనా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎదుర్కోవడంపై అవగాహన కలిగి ఉండాలని గంగవరం కేజీబీవీ ప్రత్యేకాధికారి రోహిణి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం పలమనేరు అగ్నిమాపక శాఖ అధికారులు స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాక అధికారులు, పీఈటీ తరుణమ్‌తాజ్, సీఆర్‌టీలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి



కుప్పం డిపో ఎదుట నిరసన



పుంగనూరులో....

కుప్పం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కుప్పం డిపో ఎదుట గురువారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేశారు. ఎన్‌ఎంయూఏ కుప్పం డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మునస్వామి, జయపాల్ మాట్లాడుతూ 1/2019 భద్రతా సర్క్యులర్ అమలు చేయాలని, ఉద్యోగులకు డబుల్ డ్యూటీ నగదు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ నాయకులు జి.మునెప్ప, రమణ, టీవీ.కుమార్, ఏవీ.నారాయణ, శ్రీనివాసులు, నవీన్, ఎం.బాలకృష్ణ, భాస్కర్, ప్రసన్న, దిలీప్, జి.రహంతుల్లా, వి.జయశంకర్, డి.అరుణ్, రామచంద్ర, వి.మోహన్, ఎం.చంద్రా నాయక్, వెంకటయ్య, జేవీ.రమణ పాల్గొన్నారు.

● పుంగనూరు రూరల్: ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోషియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ముందు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రామకృష్ణ, శంకర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

చదువుల తల్లికి ఘన సన్మానం



ఢిల్లీప్రియను సన్మానిస్తున్న ఎంఈవో, ప్రిన్సిపల్

శాంతిపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తుమ్మిశి ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని ఢిల్లీప్రియను గురువారం ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ నగేష్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఐటీఐ కళాశాలలో పని చేస్తున్న రామచంద్రయ్య కుమార్తె ఢిల్లీ ప్రియ బైపీసీలో 977 మార్కులు సాధించి జిల్లా ప్రభుత్వ కళాశాలల్లోనే మొదటి స్థానంలో నిలిచింది. దీంతో విద్యార్థినిని సన్మానించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటయ్య, విద్యార్థులు, కళాశాల యజమాన్యం పాల్గొన్నారు.

ఎన్నికల్లో కష్టపడిన వారికే పదవులు



సమావేశంలో మాట్లాడుతున్న భాష్యం విశ్వనాథనాయుడు

శాంతిపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధికి ఎన్నికల్లో కష్టపడ్డ వారికే పదవులు ఉంటాయని మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్‌నాయుడు అన్నారు. గురువారం మండల పరిధిలోని సొన్నేగానిపల్లె, ఎంకేపురం, దండికుప్పం, మఠం గ్రామ పంచాయతీలకు టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. సొన్నేగానిపల్లె పంచాయతీ టీడీపీ అధ్యక్షులుగా శివానంద, కార్యదర్శిగా రమేష్, ఎంకేపురం పంచాయతీకి నాగరాజు, గజేంద్ర, దండికుప్పం పంచాయతీకి యుగంధర్‌రెడ్డి, వెంకటరత్నం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, మాజీ రెస్కో ఛైర్మన్ చలపతిస్వామి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జిలు మణి, జయారెడ్డి, ఆంజనేయరెడ్డి, పెద్దన్న, నారాయణస్వామి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం



వేళ్లవారిపల్లిలో మంచినీటి బోరును పరిశీలిస్తున్న జాతీయ వాష్ నిపుణులు అన్బళగన్

కల్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ప్రతిఒక్కరికీ సురక్షితమైన తాగునీరు అందించడమే జల్ జీవన్ మిషన్ లక్ష్యమని జల్ జీవన్ మిషన్ జాతీయ వాష్ నిపుణులు అన్బళగన్ తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి పంచాయతీలో అమలవుతున్న జల్ జీవన్‌మిషన్ పథకం ద్వారా అమలవుతున్న అభివృద్ధి పనులను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పంచాయతీ పరిధిలోని వేళ్లవారిపల్లిలో జేజేఎం నిధులతో నిర్మించిన తాగునీటి ట్యాంకు, బోరు, పైపలైను, నీటి కుళాయిలను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి తాగునీటి సరఫరా, నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. ట్యాంకులో నీటి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలందరూ తాగునీటి వృథాను అరికట్టాలని, నీటి సంరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్రకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్, డీఈ రాజేంద్ర, ఏఈ గౌతమి, పంచాయతీ కార్యదర్శి శ్రీబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రిజ్వాన్, ఎంపీటీసీ మునికృష్ణమనాయుడు, నాయకులు గోపినాయుడు, దేవ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చౌడేపల్లె, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడిన సంఘటన చౌడేపల్లె మండలంలో గురువారం జరిగింది. బెంగళూరుకు చెందిన వేణుగోపాల్ సదుం మండలం తిమ్మనాయనపల్లెలోని బంధువుల ఇంటికి తన ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. లద్దిగం గ్రామానికి చెందిన రెడ్డెప్ప, షఫీ సొంత పనుల నిమిత్తం సదుం వెళ్లి వస్తుండగా మండలంలోని కడియాల కుంట సమీపంలోని రామాలయం వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

పుంగనూరు అర్బన్ సీఐగా సుబ్బరాయుడు



పుంగనూరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా తిరుపతి టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న బి.సుబ్బరాయుడు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్, పేకాట, చోరీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అరికట్టడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'మన మిత్ర' సేవలు సద్వినియోగం చేసుకోవాలి




మన మిత్ర సేవలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో కుమార్

శాంతిపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మన మిత్ర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. గురువారం రాళ్లబూదుగూరు పంచాయతీ సాతు గ్రామంలో వాట్సప్ గవర్నెన్స్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. 161 సేవలను ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా అందిస్తోందని తెలిపారు. ప్రతిఒక్కరూ ఫోన్‌నంబర్ 9552300009 ను సేవ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వాతి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ పటిష్ఠతకు కృషి చేయండి

రామకుప్పం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో బీజేపీ పటిష్ఠతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల పార్టీ కన్వీనర్ ఆంజనేయప్ప అన్నారు. గురువారం రామకుప్పంలో మండల కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎన్డీఏ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రామకుప్పం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ సులోచన అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉస్సిగానిపల్లె గ్రామ సచివాలయంలో మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు.

సేవా కార్యక్రమాలు ముమ్మరం

కల్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కల్లూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ముమ్మరం చేయాలని లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్లు శ్రీనివాస్, ప్రసాద్, విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు లయన్స్‌క్లబ్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. లయన్స్‌క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షులు మహమ్మదలి, మాజీ కార్యదర్శి రంగారెడ్డి, సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి

కల్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలోనిలో జేకే రిషి పాఠశాలలో గురువారం పాఠశాల వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రెడ్డి ప్రసాద్ రెడ్డి, హెడ్ మాస్టర్ సురేంద్రబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

గంగవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మన ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రం చేసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంతో జీవనం సాగించడానికి దోహదపడుతుందని గంగవరం ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని గంగవరం పంచాయతీ డ్రైవర్స్ కాలనీలో పారిశుధ్య పనులను చేపట్టారు. డ్రైవర్స్‌కాలనీలో పేరుకుపోయిన మట్టి, పేడ దిబ్బలను శుభ్రం చేయించారు.

ఒత్తిడికి లోనుకావొద్దు

గంగవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాలలో మార్కులను చూసి విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకావొద్దని కేజీబీవీ జిల్లా జీసీడీవో ఇంద్రాణి పేర్కొన్నారు. గురువారం గంగవరం కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినులకు 'పరీక్షలు మార్కులే జీవితమా' అంశంపై అవగాహన కల్పించారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు

రొంపిచెర్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలో ఉపాధి హామీ పథకంలో పండ్లతోటల పెంపకానికి ఈనెలాఖరులోపు ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో బాలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకంలో పండ్లతోటల ప్రతిఫలం పొందని రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అక్రమాలు బయటకొస్తాయని భూమనకు భయం

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్



చిత్తూరు సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ప్రక్షాళనతో అక్రమాలు బయటకొస్తాయని మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డికి భయం పట్టుకుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ విమర్శించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. టీటీడీ పరిరక్షణకు, గోమాత సంరక్షణకు, మత సామరస్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతిలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించడానికి భూమన కుట్రపన్నుతున్నారని, అందులో భాగంగానే టీటీడీపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా ఇటువంటివి మానుకోవాలని, లేకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

స్వచ్ఛమైన తాగునీరివ్వడమే లక్ష్యం

● జలజీవన్ మిషన్ జాతీయ వాష్ నిపుణుడు అన్బళగన్



మంచినీటి ట్యాంకును పరిశీలిస్తున్న అన్బళగన్ తదితరులు

యాదమరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరికీ స్వచ్ఛమన తాగునీరు అందించడమే లక్ష్యమని జలజీవన్ మిషన్ జాతీయ వాష్ నిపుణుడు అన్బళగన్ అన్నారు. కాశిరాళ్ల పంచాయతీలో తాగునీటి ట్యాంకును, గ్రామంలో నీటి సరఫరా వ్యవస్థను గురువారం ఆయన పరిశీలించారు. నీటి నాణ్యతను పరిశీలించి సంతృప్తి చెందారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్ర కుమార్, డీఈఈ శ్రీనివాసులు, డీవైఈ రవికిరణ్, ఏఈ ఉషారాణి, ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, కార్యదర్శి శిరీష, స్థానిక సర్పంచ్ రాధ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వేణు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలు

పూతలపట్టు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు గురువారం తీవ్రంగా గాయపడ్డారు. కడపకు చెందిన మధు, దినేష్ అనే యువకులు ముత్తిరేవుల వద్ద ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలో చదువుకుంటున్నారు. పనినిమిత్తం ద్విచక్ర వాహనంలో పూతలపట్టుకు వెళుతుండగా కాణిపాకం ఆర్చి వద్ద అదుపుతప్పి రోడ్డుపై పడి.. తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే మురకంబట్టుకు చెందిన బాలాజి అనే యువకుడు ద్విచక్రవాహనంలో పీలేరు వైపు వెళ్తుండగా, రోడ్డు పక్కన ఉన్న కారును వెనుకవైపు నుంచి ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఇతడిని చీలాపల్లె సీఎంసీకి తరలించారు. ఈ ఘటనలపై సీఐ కృష్ణమోహన్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి: తహసీల్దార్

విజయపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో భూ సమస్యలను పరిష్కారం చేసుకోవాలని స్థానికులకు తహసీల్దార్ కిరణ్ సూచించారు. గురువారం గంగమాంబాపురం, కాళికాపురం గ్రామాల్లో రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించారు. రీసర్వే డీటీ అశోక్, మండల సర్వేయర్ శేఖర్, పంచాయతీ కార్యదర్శి బేబిరాణి, టీడీపీ నాయకులు రమేష్‌రాజు, మునిభాస్కర్‌రాజు, వాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'మన మిత్ర'పై అవగాహన

వెదురుకుప్పం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మనమిత్ర కార్యక్రమంపై గురువారం వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం జరిగింది. ఎంపీడీవో ఎల్.పురుషోత్తం మాట్లాడుతూ 955230009 వాట్సాప్ నెంబరుకు సందేశం పంపడం ద్వారా 224కుపైగా పౌర సేవలను ఇంటినుంచే పొందవచ్చునని తెలిపారు. గ్రామకార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



చర్చివీధిలో గొడుగు నీడన..

పీసీఆర్ సర్కిల్‌లో పుచ్చకాయ తింటూ..

కలెక్టర్ బంగ్లా వద్ద తాటి నుంజులను కొనుగోలు చేస్తూ..

మున్సిపల్ బస్టాప్ వద్ద తలదాచుకున్న ప్రయాణికులు

కాసింత ఉపశమనం

చిత్తూరులో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. గురువారం కూడా భానుడి ప్రతాపానికి జనం ఇబ్బంది పడ్డారు. కొందరైతే డీహైడ్రేషన్ గురికాకుండా ఉండటానికి జాగ్రత్తలు తీసుకుంటుండగా 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్‌మనిపించింది.

పీవీకేఎన్ డిగ్రీ కళాశాల స్థలంపై వివాదం





నిరసన తెలుపుతున్న పీవీకేఎన్ కళాశాల విద్యార్థులు - విచారణ చేస్తున్న చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

చిత్తూరు సెంట్రల్/రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గిరింపేటలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలంపై వివాదం జరిగింది. కళాశాల పరిసరాల్లో 2020లో తమకు 25 సెంట్ల భూమిని ఈసీహెచ్ఎస్(ఎక్స్ సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్)కు కేటాయించారని గురువారం నిర్మాణ పనులను మిలటరీ అధికారులు ప్రారంభించారు. దీన్ని కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్స్‌పాల్ జీవనజ్యోతి అడ్డుకుని, ధర్నాకు దిగారు. ఈ స్థలం కళాశాలకు చెందినదేనని నిరసన తెలిపి, కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. విషయం తెలుసుకున్న చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఘటన స్థలం వద్దకు వచ్చి.. విచారించారు. ఇరువురి వద్ద ఉన్న పత్రాలను తీసుకొస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంక్షిప్తంగా..

సమస్యలను పరిష్కరించండి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని వీఆర్వోలను తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన జనం ఎక్కువగా భూసమస్యలపైనే అర్జీలను సమర్పించారు .వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని వీఆర్వోలకు ఆదేశాలిచ్చారు. అలాగే ప్రజలకు అందుబాటులో ఉండాలని సర్వేయర్లకు, వీఆర్వోలకు సూచించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



చిత్తూరు సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బీవీ రెడ్డి పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించినట్లు అగ్నిమాపక శాఖాధికారి పెద్దిరెడ్డి తెలిపారు. ఏడీఎఫ్‌వో కరుణాకర్, ఎల్ఎఫ్‌లు సురేష్, ఏసుపాదం, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



బంగారుపాళ్యం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ చూపిన శ్రీచైతన్య విద్యార్థులను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ గురువారం అభినందించారు. ఒలంపియాడ్ వారు నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో బంగారుపాళ్యం శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చూపారు. గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్లను పొందారు. వీరు ఎమ్మెల్యేను కలవగా, ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్ ప్రతిమ, టీచర్లు సురేష్, చక్రీధర్, ప్రతాప్, పవన్ పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి: సీహెచ్‌వోలు



పెనుమూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ పీహెచ్‌సీ సబ్‌సెంటర్ పరిధిలో మండలంలో పనిచేస్తున్న సీహెచ్‌వోలు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పెనుమూరు పీహెచ్‌సీ ముందు శాంతియుత నిరసన తెలిపారు. తమకు 23 శాతం ఇంక్రిమెంటు ఇవ్వాలని, మే నెల నుంచి పీఎఫ్ కట్ కావడం లేదని, ఆరేళ్ల సర్వీసు పూర్తయిన వారిని రెగ్యులర్ చేయాలని జీవో ఉన్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. కీర్తిప్రియ, చరిత, విష్ణుప్రియ, భార్గవి, చైతన్య, హిమబిందు, ఆయేషా, శశికళ, త్రివేణి పాల్గొన్నారు.

భాగ పరిష్కారం కానీయడం లేదు!

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబానికి చెందిన ఉమ్మడి ఆస్తిని భాగ పరిష్కారం చేయకుండా తన అన్న కుట్ర పన్నుతున్నారని యాదమరి మండలానికి చెందిన లోకనాథ గౌండర్ ఆరోపించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తన అన్న గత ప్రభుత్వ హయాంలో అప్పటి వైసీపీ నేతల అండతో ఉమ్మడి ఆస్తిని కాజేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. పోలీసు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.

అలరించిన భజనలు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి విశ్వసాయి షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం సత్య సాయిబాబా భజనలు అలరించాయి. సత్యసాయి సేవాసమితి నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడిని ఆలయ నిర్వాహకులు సత్కరించారు. మధుసూదనం, సత్యనారాయణ, పాండురంగం, శేషనారాయణ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under instructions from my client The Branch Manager, M/s Shriram Finance Ltd, Madanapalle Branch, issue the Trade Loan Sri. Gurrappa Durga Prasad, S/o Gurrappa Subramanyam residing at D.No.15-181, Ramakrishna Street, Gandhi Road, Madanapalle Town, Annamayya District. BY keeping of her property more fully described here under are security by way of Regd. Mortgage as such if anybody have any claims, charges, mortgages, sale agreements, Court attachments etc. Shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice otherwise, later objections will not bind on my client in this regard.

SCHEDULE

Chittoor District, Chittoor Sub-District, Thavanampalle Mandal, Siddampalle Gramam, Patnam Gram Panchayat, S.No. 119 Paiki 66.44 Square yards site. Bounded on: East: House belongs to Ganapathi, West: Sandu and House of Jyothi, North : House belongs to Govindarajulu, South : Raja Veedhi. Within this area measuring East-West both side 22 feet or 6.710 meters, North- South both site 28 feet or 8.540 meters, in total area 66.44 Square yards or 616 Square feet site.

G. JANARDHANA REDDY, B.A., B.L.,
Advocate, Madanapalle - 517 328
Cell 9490773727

వాహనం ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభం



విరిగి రోడ్డుపై పడ్డ విద్యుత్ స్తంభం

యాదమరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిపై దేవళం వద్ద బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ప్రమాదం జరిగినప్పుడు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

రహదారికి సమీపంలోనే స్తంభాలు: గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు అంతర్రాష్ట్ర రహదారికి సమీపంలో ఉన్నాయని ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసులు, డీఈ ధనలక్ష్మి తెలిపారు. రోడ్డు మరమ్మతుల పరిశీలనకు వచ్చినవారు మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా దూరంగా ఉండేలా స్తంభాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ ఏఈకి సూచించారు. సాయంత్రం ఎక్స్‌కవేటర్ సాయంతో విరిగిన విద్యుత్ స్తంభాన్ని సిబ్బంది తొలగించి, కొత్తది ఏర్పాటు చేశారు.

ఎస్సీ వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం చారిత్రక నిర్ణయం: టీడీపీ



సమావేశంలో ప్రసంగిస్తున్న టీడీపీ ఎస్సీసెల్ నాయకులు

పూతలపట్టు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడం చారిత్రక నిర్ణయమని టీడీపీ ఎస్సీసెల్ నాయకులు అన్నారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఇటువంటి నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కోదండయ్య, పార్లమెంటు అధికారప్రతినిధి గురుస్వామి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వీరభద్రయ్య, మండల అధ్యక్షుడు సుబ్బరాజులు, మండల ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఎంపీటీసీ బాలరాజు, ప్రధాన కార్యదర్శి హరి, నాయకులు ముత్తు, గోపి, వెంకటస్వామి, సుబ్రహ్మణ్యం, శరవణకుమార్, బుజ్జయ్య పాల్గొన్నారు.

అర కిలో గంజాయి స్వాధీనం: విక్రేత అరెస్టు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అర కిలో గంజాయిని స్వాధీనం చేసుకుని, విక్రేతను అరెస్టు చేశారు. ఒకటో పట్టణ సీఐ మహేశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. గంజాయి రవాణా, విక్రయాలపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో గిరింపేట భరత్‌నగర్ వద్ద మహబూబ్ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. గురువారం దాడిచేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అర కిలో గంజాయిని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్



విజయపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి.. తహసీల్దార్ కిరణ్‌కు అప్పగించినట్టు ఎస్ఐ రంగా తెలిపారు. డీఎస్పీ ఆదేశాలతో బుధవారం రాత్రి ఎస్ఐ తన సిబ్బందితో నిఘా పెట్టారు. సామిరెడ్డికండ్రిగ వద్ద టిప్పర్‌లో ఇసుక తరలిపోవడాన్ని గుర్తించి పట్టుకున్నారు. టిప్పర్ యజమానికి జరిమానా విధించినట్టు తహసీల్దార్ తెలిపారు.

గ్రావెల్ బిల్లు ముసుగులో..: కేవీపురం వద్ద కుశస్థలి నది నుంచి ట్రాక్టరు, ఎద్దుల బండి ద్వారా ఇసుకను తీసుకొచ్చి డంప్ చేసి.. రాత్రిపూట అక్రమంగా రవాణా చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నగరి, నింద్ర మండలాల నుంచి కూడా ఇసుకను విజయపురం మండలం మీదుగా అక్రమంగా తరలించేస్తున్నారన్న విమర్శలూ ఉన్నాయి. గ్రావెల్ బిల్లు ముసుగులో ఇసుక రవాణా చేస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. దీనిపై నిఘా పెట్టాలని కోరుతున్నారు.

మెరుగైన ఫలితాలొస్తున్నాయ్

● ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డిరామరాజు



ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

ఐరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన ఫలితాలొస్తున్నాయని ప్రిన్సిపాల్ రెడ్డిరామరాజు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో 90 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. వెయ్యి మార్కులకు ఎంపీసీలో.. మురహరి 946, శ్రీవిద్య 944, బైపీసీలో దీనదయాకర్ 864, సీఈసీలో దుర్గాప్రసాద్ 822 మార్కులు వచ్చాయని వివరించారు. ఎంపీసీ విద్యార్థులకు ఐఐటీ మద్రాస్ వారితో ఆన్‌లైన్ క్లాసులు చెప్పిస్తున్నట్లు తెలిపారు. ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలతోపాటు మధ్యాహ్న భోజనం కూడా విద్యార్థులకు పెడుతున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలని కోరారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

హెచ్చరిక

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడం ఏమనగా మా కక్షిదారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తిరుపతి జిల్లా తిరుపతి పట్టణ, మండలం, సత్యనారాయణపురం, ఇం.నెం. 7-113 నందు నివాసముండు కీ॥శే॥ వేంపల్లి నరసరాజు గారి ధర్మపత్ని అయిన వేంపల్లి అమ్మణ్ణి అనువారు షెడ్యూలు దాఖల ఆస్తికి యజమానిగా వున్నారు. సదరు మా కక్షిదారు తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయస్థానం నందు దావా సంఖ్య 176/2016. 1. మాధురి గాంధి 2.డా॥ ఎ.పూర్ణచంద్ర రావు 3. ఎన్.హేమలత 4. కె.రవీంద్ర బాబు అను వారిపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా న్యాయస్థానంలో విచారణ దశలో వుండగా, చిత్తూరు జిల్లా, కార్వేటీనగరం వాస్తవ్యులైన ఎస్.క్రిష్ణయ్య గారి కుమారుడు ఎస్.కోదండయ్య అను అతను మరియు మదనగోపాల్, కె.ఎం.సుజాత, భారతంమిట్ట, పాకాల మండలం మీరు ప్రతివాదులతో కలిసి నామ మాత్రపు విక్రయ ఒప్పందము, విక్రయ పత్రములు షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి మా కక్షిదారుని ఆస్తిని కాజేయాలనే ఉద్దేశ్యంతో, పత్రులు సృష్టించే ప్రయత్నములు చేయుచున్నారని విశ్వసనీయముగా తెలియ వచ్చినది. కావున సదరు దావాలో ప్రతివాదులతోషెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరిపిన యెడల అట్టి ఎంతమాత్రమూ చెల్లనేరవు. ఒక వేళ ఈ హెచ్చరికను మీరి ఎవరైనా ప్రవర్తించిన యెడల మా కక్షిదారు గైకొను సివిల్, క్రిమినల్ చర్యలకు అట్టివారు బాధ్యులవు కాగలరని ఈ ప్రకటన ద్వారా హెచ్చరించడమైనది.

షెడ్యూలు:- చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రి.డి., - తిరుపతి అర్బన్ మండలం - అక్కారంపల్లి గ్రూపు -7/1బి & 7/1సి లో విస్తీర్ణము ఎ.1-07 సెంట్లు తుంబువానిగుంట గ్రామలెక్క దాఖలా ఖాళీ జాగాకు **హద్దులు:** తూర్పు: రోడ్డు, పడమర: వేలాయుధం, శ్రీనివాసులురెడ్డి, ఉత్తరం: నాగరాజశెట్టి భూమి దక్షిణం: చింత ఆది నారాయణరావు గారి భూమి, తూర్పు నుండి పడమర:- 60అ . లేదా 18.300 మీ. ఉత్తరం - దక్షిణం: 24అ. లేదా 7.32 మీ. వెరశి మొత్తం 160 చ.మీ. లేదా 0.03 1/2 సెంట్ల భూమి.

సి.హెచ్.ఎం.ఎస్.రాజు, న్యాయవాది, తిరుపతి

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న సర్పంచ్ కుమారి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సర్పంచ్ కుమారి అన్నారు. గురువారం ముంగరమడుగు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో ఆమె పాల్గొన్నారు. క్రీడా సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎం అనితాదేవి, టీచర్ మునిరత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



చిత్తూరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించడానికి అధిక లోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను నగరంలో అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం తేనబండలో నూతన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఈఈ మునిచంద్ర ఆదేశాలతో టౌన్ డీఈ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

విజయపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పన్నూరులో ఆనంద వల్లీదేవి సమేత ఇష్టకామేశ్వరస్వామి ఆలయంలో మహా కుంభాభిషేకాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణాన్ని, వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త మదనగోపాల్‌రాజు, అన్నదాన నిర్వాహకుడు రఘునాథరెడ్డి, పురోహితుడు బాలసుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న పుత్తూరు డీవైఈవో ప్రభాకర్‌రాజు

నింద్ర, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చవరంబాకం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం రాజు ఉద్యోగ విరమణ సందర్భంగా ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం ఆయన్ను సన్మానించారు. పుత్తూరు డీవైఈవో ప్రభాకర్‌రాజు, ఎంఈవోలు వసుమతిదేవి, శ్రీధర్ రాజు, టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులను వ్యసనాలబారిన పడనీయొద్దు



వైద్య సిబ్బంది కొరతను తెలియజేస్తున్న సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి

పూతలపట్టు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు వ్యసనాలకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులదేనని పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పల్లె ప్రాంతాల్లో గంజాయి, మత్తు పదార్థాలను ఎవరైనా అమ్ముతుంటే తమ దృష్టికి తేవాలని కోరారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో బెట్టింగ్ యాప్‌లకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు, సిబ్బంది కొరత ఉందన్నారు. అనంతరం రెవెన్యూ, విద్యుత్ సమస్యలపై అధికారులపై ప్రజాప్రతినిధులు గళమెత్తారు. ఎంపీడీవో నాగరాజు, జడ్పీటీసీ దేవిక, తహసీల్దార్ రమేష్, వైస్ ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

విజయపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలని గర్భిణులు, కిశోర బాలికలకు నగరి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో కృష్ణవేణి సూచించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పన్నూరు అంగన్వాడీ కేంద్రంలో పోషక విలువలు తెలిపే ఎగ్జిబిషన్ నిర్వహించారు. సూపర్‌వైజర్ లక్ష్మి, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరి: మండలంలోని దామరపాకం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణవేణి అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ శంకరమ్మ పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: తూగుండ్రం ప్రాథమిక పాఠశాలలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ, అంగన్వాడీ టీచర్లు గీత, గుణవతి, ఏఎన్ఎం జ్యోతి, ఆశావర్కర్ సుశీల పాల్గొన్నారు.